నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ గురువారం 16-10-2025   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:53   పేజీలు:6   వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

ధర్మ నిరతి
సర్వ మానవ శోభ
ప్రకృతి వరం.

ముదిమికి ' డీ'
దేహానికి విటమిన్
నిండు యవ్వనం.

యూరియా బస్తాలు
దక్కని రైతు గోస
గోడు గోదారి.

పోటీ ప్రపంచం
మానసిక సవాళ్లు
దృఢ సంకల్పం.

దోమల విందు
బస్తీ అంతట సుస్తీ
వైద్యం కరువు.



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

పాము బుసల వానలతో
పగబట్టే ప్రకృతి !
కష్టపడ్డ నష్టమొచ్చె
రైతు బతుకు వికృతి !
పంటను నాశనం చేసె
క్లౌడ్ బరస్టు దూతలు !
పరిహారం ఇవ్వాలని
రోడ్డెక్కిన రైతులు !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# గాయని బాల సరస్వతి కన్నుమూత



హైదరాబాద్, అక్టోబర్ 15: తెలుగులో తొలి నేపథ్య గాయని బాల సరస్వతి(97) మృతి చెందారు. హైదరాబాద్‌లో ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసు ఉన్నప్పటినుంచే బాల సరస్వతి పాటలు పాడడం మొదలుపెట్టారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో మొత్తం 2000కి పైగా ఆమె పాటలు పాడారు.

లలిత సంగీత దిగ్గజంగా పేరుందిన బాల సరస్వతి దేవి 1939లో మహానంద సినిమాతో తెలుగులో తొలి నేపథ్య గాయనిగా గుర్తింపు పొందారు. ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచయమైన బాల సరస్వతి.. 'సతీ అనసూయ' సినిమాలో తొలి పాటను పాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ తొలి దశలో అనేక మధుర గీతాలు ఆలపించారు. తెలుగు, తమిళ సినిమాల్లో 1930 నుంచి 1960 వరకు పాటలు పాడటంతో పాటు పలు చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు.

# ప్రధాని మోదీ సభ ఏర్పాట్లు వేగిరం

## –అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష

### సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ సభ విజయవంతానికి అందరూ బృందంలా పని చేయాలని సూచన



అమరావతి, అక్టోబర్ 15:సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ సభ కేవలం రాజకీయ సభ కాదు.., దేశ ఆర్థికాభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ప్రజలకు చేరవేసే వేదిక.. ప్రధానమంత్రి ప్రజలతో నేరుగా మమేకమవుతారు. అందువల్ల ఈ సభను చరిత్రాత్మకంగా మార్చాలి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 16న కర్నూలులో జరగనున్న సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంగళవారం సహచర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని పర్యటన రాష్ట్రానికి అత్యంత ప్రాముఖ్యత కలిగినది. ప్రతి శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు ఒకే బృందంలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, నీటి సదుపాయాలు, వైద్య సేవలు, పార్కింగ్, వేదిక నిర్మాణం వంటి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి మండలంలో ప్రజల్లో ఉత్సాహం నింపి ప్రధానమంత్రికి అద్భుత స్వాగతం పలుకుదామని కోరారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

కామారెడ్డి, అక్టోబర్ 15: భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 44వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్లో వచ్చిన టిప్పర్, స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల ద్వారా సమచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పోలీసుల కథనం ప్రకారం.. భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద ఉన్న 44వ జాతీయ రహదారిపై ఎలక్ట్రిక్ స్కూటీపై నలుగురు ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో రాంగ్ రూట్లో వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో 3 సంవత్సరాల బాలుడు, మహిళ, వృద్ధుడు అక్కకక్కడే మృతి చెందగా.. ఆరు నెలల పాప పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ పాపను కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష.. ధాన్యం కొనుగోళ్లపై దిశా నిర్దేశం



హైదరాబాద్, అక్టోబర్ 15:సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైం రికార్డ్ సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ వానాకాలంలో రికార్డ్ స్థాయిలో 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. అధిక దిగుబడి, అధిక కొనుగోళ్ల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ధాన్యం కొనుగోలులో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకార్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న రవాణా వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రైతులు ఎక్కడ కుడా నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన అంశంలో అత్యవసరం అనుకుంటే అదనపు ఖర్చులకు వెనకాడ వద్దని వివరించారు.

ధాన్యం కొనుగోలు వివరాలను సత్వరమే నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. నమోదు అయిన కొనుగోళ్లకు 48 గంటలలో చెల్లింపులు జరగాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు అందరూ.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ముందుకు వెళ్లాలని సూచించారు. మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

# మంత్రుల మధ్య వివాదాలు లేవు: శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబర్ 15:మంత్రుల మధ్య వివాదాలపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రుల మధ్య వివాదాలు లేవని స్పష్టం చేశారు. తాను సీన్సియర్ కాంగ్రెస్ వాదినని చెప్పుకొచ్చారు. తనకి నీచ రాజకీయం చేసే శక్తి లేదు.. యుక్తి అంతకన్న లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను పార్టీని నమ్ముకొని ఉన్నానని క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఇవాళ(బుధవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. పార్టీని నమ్ముకోకుండా అటు, ఇటు పోయే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు.

తాను పార్టీని బలోపేతం చేసే వ్యక్తినని చెప్పుకొచ్చారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందని చెప్పిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతామనే బీఆర్ఎస్ నేతలు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రామరాజ్యమని అభివర్ణించారు. తెలంగాణలోని ప్రజలందరూ రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# రూ.139 కోట్ల భూమిలో ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 15:హైదరాబాద్‌లోని అక్రమ కట్టడాలపై హైడ్రా పంజా విసుతున్న సంగత విదితమే. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను కాపాడుతున్న నంగతి తెలిసిందే. తాజాగా రాజేంద్రనగర్‌లో ఈ రోజు రూ. 139 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది.

రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ మండలంలో బద్వేల్ – ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2 లలో ఆక్రమణలకు గురైన నాలుగు పార్కులస్థలాన్నిరక్షించారు. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా ప్రకటించింది. దీని విలువ రూ. 139 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పెప్పర్ స్ప్రే కొట్టిన విద్యార్థి.. ఆస్పత్రిలో చేరిన 9 మంది

తిరువనంతపురం, అక్టోబర్ 15: కేరళలోని తిరువనంతపురంలోని ప్రభుత్వం స్కూల్‌లో ఓ విద్యార్థి క్లాస్‌రూమ్‌లో పెప్పర్ స్ప్రేకొట్టాడు. ఈ ఘటనలో 9 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారు. శ్వాసకోస ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులను నీమమ్ తాలూక ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ కాజువాల్టీ వార్డులో స్టూడెంట్స్‌కు చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. తీవ్రమైన శ్వాస ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు.

పున్నమూడు ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్ రాణి మాట్లాడుతూ.. స్కూల్‌లో ఇంటర్వెల్ తర్వాత క్లాస్‌రూమ్‌లో ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. ఓ టీచర్ క్లాస్‌రూమ్‌కు వెళ్లగా.. అక్కడ విద్యార్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నట్లు గుర్తించారు. ఆ వెంటనే కొందర్ని క్లాస్‌రూమ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. ఇద్దరు టీచర్లకు కూడా బ్రీతింగ్ సమస్య వచ్చింది. పెప్పర్ స్ప్రే వాడినట్లు తేల్చారు.

అయితే క్లాస్‌రూమ్‌కు ఎందుకు పెప్పర్‌స్ప్రేను తీసుకువచ్చారో తెలియదు. ఈ కోణంలో స్కూల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. విద్యార్థులకు సరైన వైద్యం అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి.. 24 గంటల్లోగా ధాన్యం తరలించాలి

## – పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం




కరీంనగర్, అక్టోబర్ 15:జిల్లాలో వానా కాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు సంబంధిత అధికార యంత్రాంగం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసి వరి ధాన్యాన్ని 24 గంటల్లోగా రైస్ మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలుపై అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాస్త ముందుగానే ప్రారంభించాలన్నారు.

కొనుగోలు చేసిన 24 గంటల్లోగా రైస్ మిల్లులకు తరలించి ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. రైతులు వరి కోతల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. నవంబర్ చివరి వరకు జిల్లాలో 2 లక్షల పైగా మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా కార్యాచరణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం శ్రీకాంత్, డీఎంవో పీ ప్రవీణ్ రెడ్డి, డీఆర్డీవో కాళిందిని, డీఏవో బీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏ సంస్థా బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అంతరాయం కలిగించదు : కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ పై నిషేధం విధించాలన్న ప్రతిపాదనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అంతరాయం కలిగించే హక్కు ఏ పార్టీకి లేదని, ఏ సంస్థ కూడా పబ్లిక్ ప్లేస్‌లలో ప్రజలను ఇబ్బంది పెట్టదని ఆయన వ్యాఖ్యానించారు.

ఇప్పటికే తమిళనాడులో ఆ సంస్థపై చర్య తీసుకున్నారని, దాన్ని పరిశీలించి తదుపరి చర్య చేపడుతామని సిద్ధరామయ్య చెప్పారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, క్యాబినెట్ విస్తరణపై కూడా సిద్ధూ స్పందించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ సహా అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

కోర్టు ఆదేశాల మేరకు సాధ్యమైనంత త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సిద్ధరామయ్య తెలిపారు. అన్ని స్థానిక ఎన్నికలను దశలవారీగా నిర్వహిస్తా మని చెప్పారు. ఎన్నికలతో ప్రజాస్వా మ్యం బలోపేతమవుతుందని అన్నారు. ఇక క్యాబినెట్ విస్తరణపై మాట్లాడుతూ.. ముందైతే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే, తర్వాత క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని చెప్పారు.

# సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బాలునాయక్



నల్గొండ, అక్టోబర్ 15: రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలంలోని మర్రిచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందేలా ఈ విత్తనాలను సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ జడ్పీటీసీ మారుపాకల అరుణ సురేష్ గౌడ్, మాజీ ఎంపీపీ జాన్ యాదవ్, సీనియర్ నాయకులు రుక్మారెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

# మహిళ పై లైంగికదాడి

**-పల్నాడు జిల్లా గుంటూరు**
**- పెద్దకూరపాడు మధ్య ఘటన**
**-సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు**
**-నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**

అమరావతి, అక్టోబర్ 15: పల్నాడు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. రన్నింగ్ ట్రైన్‌లో ఒంటరిగా ఉన్న ఓ ప్రయాణికురాలిపై దుండగుడు కత్తితో బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గుంటూరు– పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం జరగ్గా, బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళ్తే..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ(35) సోమవారం (13వ తేదీ) రాజమ హేంద్రవరంలో సంత్రగాచి ప్రత్యేక ట్రైన్ మహిళా బోగీలో ఎక్కారు. ఆ రైలు గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సమయంలో బోగిలో ఉన్న ప్రయాణికులంతా దిగిపోయారు.

ఆమె ఒక్కతే మిగిలారు. ఆ సమయంలో రైలు కదులుతుంది. సుమారు 40 సంవత్సరాల వ్యక్తి రన్నింగ్ ట్రైన్ లో మహిళ బోగిలోకి ప్రవేశించి ఎక్కాడు. రైలు గుంటూరు నుంచి బయలుదేరిన 20 నిమిషాల తరువాత ఒంటరిగా ఉన్న మహిళపై ఆ వ్యక్తి కత్తితో బెదిరించి హ్యాండ్ బ్యాగ్, సెల్ ఫోన్, డబ్బులు లాక్కొని లైంగికదాడి చేశాడు. రైలు పెద్దకూరపాడు స్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో ఆ వ్యక్తి కిందకు దిగి పారిపోయాడు. మంగళవారం రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకునిది. అనంతరం బాధిత మహిళ చర్లపల్లికి రాగానే నేరుగా సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# లొంగిపోయిన మల్లోజుల.. సీఎం ఎదుట ఆయుధాల సమర్పణ



న్యూఢిల్లీ, అక్టోబర్ 15:సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయుధాలు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు.

మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో తమ ఆయుధాలను మల్లోజుల అందించారు. దాదారు రూ.6 కోట్ల రివార్డు మల్లోజులపై ఉండటంతో రివార్డును ఆయనకు సీఎం ఫడ్నవీస్ అప్పగించారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో మోస్ట్‌వాంటెడ్‌గా మల్లోజులు ఉన్నారు. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు విడుదల చేస్తూ వచ్చారు. పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని తెలుపుతూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి తప్పుకున్నారు. మల్లోజుల వేణుగోపాల్‌రావుపై వందకు పైగా కేసులు ఉన్నాయి. నిన్న 60 మంది మావోయిస్టులతో కలిసి మల్లోజుల లొంగిపోయిన విషయం తెలిసిందే.

తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు మల్లోజుల వేణుగోపాల్‌రావు మూడో సంతానంగా జన్మించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తండ్రి నుంచే మల్లోజుల పోరాట స్ఫూర్తిని అలవర్చుకున్నారు. చదువు పూర్తి చేసుకున్న తరువాత తన అన్న పిలుపు మేరకు మావోయిస్టు ఉద్యమంలో ప్రవేశించారు. పార్టీలో ఆయనను అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు.

**రాధశ్రీ రాగాలు**

ఆట "వెలది"ని విడచి
"ఆట వెలది"ని వలచి
వేమన జగతి నిలచె
నను రాధశ్రీ.
తా నిలచి యొకచోట
తోలు బొమ్మల ఆట
దేవు డాడించునట
అనును రాధశ్రీ.



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

యుద్ధాన్ని సృష్టించే
ఉన్మాదపు వైఖరోళ్లే
ఆపించి శాంతి ప్రభు
అవతారం ఎత్తెటోళ్లే.
ప్రపంచాధిపత్యానికి
పరుగుపెట్టే నేతలు
నరహంతక క్రతువుల
నాజీ యమ దూతలు



-వేల్పుల నారాయణ
9440433475

(యాభైఏళ్ళ మండేసూర్యుడు కవిత్వంపై విశ్లేషణ)

# కొత్తకవులూ..! శేషేంద్రనూ చదవండి..!!

అక్టోబర్ 20 గుంటూరుశేషేంద్ర శర్మ జయంతి సందర్భంగా..

సామాజికమాధ్యమాలు, వెబ్‌పత్రికలూ, పీడిఎఫ్ పత్రికలు, ఆన్‌లైన్ కవిత్వపోటీలు వచ్చాక తెలుగు సాహిత్యంలో కవిత్వం ఉప్పెనలా, త్సునామీలా వస్తున్నది. ఒక్క తెలుగులోనే అని అనలేం. భారతీయభాషలన్నింటా ఇదే ఒవరడి కొనసాగుతున్నది. వర్తమాన సాహిత్యంలో కవిత్వం చదువుతుంటే అందులో కవిత్వం పాళ్ళు తక్కువే. కారణం అన్వేషించినపుడు ఇతరుల కవిత్వాన్ని చదువకుండా, ప్రామాణికమైన కవిత్వాన్ని అధ్యయనం చేయకుండా కవిత్వంలో ఉన్న కాసిన్ని కవిత్వనిర్మాణ పద్ధతులు చదువకుండా కవిత్వం రాయడం వల్ల వస్తున్న కొత్త కవుల కవిత్వంలో కవిత్వం ఉండటం లేదు. అందరనీ అనడం లేదు. కొత్తగా వచ్చినవాళ్ళు బాగా అధ్యయనం చేసి రాసేవాళ్ళ సంఖ్యకూడా వుంది. అయితే అందరినీ చదవకపోయినా కనీసం శేషేంద్ర కవిత్వమైనా చదివితే మన కవిత్వంలో కవిత్వం పాళ్ళు ఎంతుందో అంచనా వేసుకోవచ్చు. ఈ నేపథ్యంలోనే గుంటూరు శేషేంద్ర శర్మ యాభైఏళ్ళ క్రితం అంటే అర్ధ శతాబ్ది పూర్తిచేసుకున్న మండే సూర్యుడి కవిత్వాన్ని పరిచయం చేయడం వర్తమాన కవులకు ఉపయోగకరమని భావిస్తున్నాను.

గుంటూరు శేషేంద్ర శర్మ గూర్చి మాట్లాడటమన్నా, రాయడమన్నా చాలా ఇష్టం. ఎందుకంటే ఆయన కవిత్వం ఎప్పటికీ పాఠంగా బోధపడుతుంది. వొక కవి కవిత్వం మరొక కవిని ఎందుకింత ప్రభావితం చేస్తుంది.? ఆ కవి కవిత్వం ఎందుకింతలా ఆకట్టుకుంటుంది? ఔనన్నా..కాదన్నా ఆ కవి కవిత్వం చదివిన ప్రతి పాఠకుని మనసులో నిక్షిప్తమై, పదేపదే పలవరించి, పలకరించి నూతనోత్సాహాన్నిస్తుంది. ఆ కవే మహాకవి శేషేంద్ర.

కవిత్వంలో వస్తువంటారా..రూపమంటారా..

ఈ కవిత్వం చదువుతున్నంతసేపూ కవిత్వ లయవిన్యాసం కనుపాపలపై దృశ్యమై కనబడుతుంది

సారమంటారా..శిల్పమంటారా ఇతరేదైనా కవిత్వనిర్మాణ రహస్యాలనండి కనీసం ఆయన్ని చదివితే కవులకు వొక సిలబస్‌లా పనికొస్తుంది. గుంటూరుశేషేంద్రశర్మ కవిత్వం ఆధునిక కవిత్వాన్ని అంతలా ప్రభావితం చేస్తుంది. ఆయన కవిత్వం నుంచి ఏం నేర్చుకోవచ్చో పరిశీలిద్దాం.

'నేను చెమట బిందువుని/కండల కొండల్లో ఉదయించే లోకబింధువుని/గుండెలతో నాకు దోస్తీ/నేనుండేది బాధల బస్తీ/సింధువంత చరిత్ర నా పిడికిట్లో ఉన్నా/చెప్పకుండా మనిషిని చెక్కినశిల్పిని'

ఈ కవిత్వం చదువుతున్నంతసేపూ కవిత్వ లయవిన్యాసం కనుపాపలపై దృశ్యమై కనబడుతుంది. అతడు కవి. ఈ కవిత్వజగత్తును శాసించిన కవి. అసలు శేషేంద్ర కవిత్వంలో ఏముంటుంది అన్నప్పుడు శేషేంద్ర కవిత్వంలో కవిత్వమే వుంటుంది. మిగతా కవుల కవిత్వంలో కవిత్వముండదా అన్నప్పుడు ఇంత గాఢతగా, ఇంత వస్తువైవిధ్యంగా, ఇంత శిల్ప విన్యాసంగా వందకు వందశాతం ఉండకపోవచ్చు. పై కవితా వాక్యాలు చదివితే నరాల్లో రక్తం ఉప్పొంగుతుంది. అసలు గొప్పకవిత్వం రాయడానికే శేషేంద్ర పుట్టాడా అన్న ఈర్ష్యకలిగేలా శేషేంద్ర కవిత్వం రాశారు. 1970వ దశకం కవిత్వం విజృంభిస్తున్న కాలమది. ప్రగతిశీల కవిత్వమే ఈ దేశాన్ని పురోగమనం వైపు నడిపిస్తుందని, గాలీ, నీరూ, నేలా ఎలాగో కవిత్వమూ అలా ఉండాలని భావిస్తున్న కాలంలో ఈ కవి కవిత్వపు సిరులు పండిరచారు. వొకవైపు విప్లవకవుల ఆధునిక కవిత్వం శ్రామిక సంస్కృతికి చెందిన కవిత్వం పుంఖానుపుంఖాలుగా వస్తుంది. సమాంతరంగా 19వ శతాబ్దం వరకు కొనసాగిన భూస్వామిక, బూర్జువా సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఇరవయ్యో శతాబ్దంలో కూడా అదే ఒరవడిని ఈ పాలక పద్య కవులు రచనలు చేస్తున్న కాలంలో ఈ కవి ఆధునిక కవిత్వంలోనే గొప్ప కవిత్వాన్ని అందించారు. ఆ క్రమంలో వచ్చిన అద్భుత వస్తు, శిల్పసౌందర్య కవిత్వమే శేషేంద్ర మండేసూర్యుడు. ఆ కాలంలో జీవించిన శ్రీశ్రీ, చెరబండరాజు, ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు, కుందుర్తి తదితర కవులందరితోపాటు శేషేంద్ర తనదైన శైలితో ఆధునిక తెలుగుకవిత్వాన్ని చిటికెన వేలు పట్టుకుని నడిపించారు. కానీ శేషేంద్ర కవిత్వసృజన అమోఘం. భిన్నంగా నడిపారు. శేషేంద్ర అంటే శ్రీశ్రీకి కూడా చాలా ఇష్టం. శ్రీశ్రీ అంటే కూడా శేషేంద్రకు అమితమైన ప్రేమ. అందుకే శ్రీశ్రీ శేషేంద్ర కవిత్వాన్ని ఫ్రెంచి మద్యమా? శేషేంద్ర కవిత్వమా అన్నాడు. శ్రీశ్రీ వొకసందర్భంలో కేసులో అరెస్ట్ చేయబడితే తన ఉద్యోగాన్ని కూడా లెక్కచేయక శేషేంద్ర శ్రీశ్రీకి జామీను సంతకం చేసి బయటకుతీసుకొచ్చారు. శేషేంద్ర కవిత్వం వొక్కసారి మనసుపెట్టి చదివితే మరచిపోలేము. కారణం కవితావాక్యాల ప్రవాహం, శిల్పసౌందర్యం అలా వుంటాయి.

**నా శరీరం / ఒక శాశ్వత హోమం/**
**అది సూర్యుడి స్వగ్రామం**

ఏ కవిత చదివినా ముందు మనం చదువుతున్నప్పుడు కనబడేది కవితాశబ్దం. ఆ శబ్దం కవితవస్తువునెలా ప్రకాశవంతం చేస్తుందో ఆ శబ్దం చేస్తూ కవి హృదయాంతరాళ,లోకి ప్రవహించి మనసును ఉల్లాసపరుస్తుందో శేషేంద్ర కవిత్వమే చక్కటి ఉదాహరణ. నిజానికి శిల్పం అన్నప్పుడు కవిత్వంలో భావుకత, ఇతివృత్తం, ఎత్తుగడ, వస్తువు తదితర సంగతులన్నీ కూడా కవిత్వశిల్పానికి పునాదులు వేస్తాయి. ఇవి శేషేంద్ర అలవోకగా అధిగమించి రాసేస్తారు. అందుకే భారతీయ సాహిత్యంలోనే శేషేంద్ర కవిత్వం వొక ప్రత్యేకం.

**కొండల నిశ్శబ్దాన్ని/బొట్టుబొట్టుగా చప్పరిస్తున్నప్పుడు**
**/చప్పుడు చేశే నా గుండెను కూడా /క్షమించలేను.**

కవిత్వంపై ఎంత సాధికారత ఉంటే మాట్లాడతారిలా? అడవిలోని ప్రకృతి అందాలను సాదారణ మనుషులు చూసి పరవశించి పలవరించడం ఒక దృశ్యం మాత్రమే. అది కాసేపటికి మస్తిష్కంలోంచి చెదిరిపోవచ్చు, చెరిగిపోవచ్చు. కానీ కవి నేత్రాలతోనే కాక మనోనేత్రాన్ని కూడా తెరచిచూస్తారు. అప్పుడే కవిత్వం సముద్రమౌతుంది. మండేసూర్యుడు కవిత్వంలో ప్రతి కవిత పాఠకుడిని ఆకట్టుకుంటుందంటే అది చాలా చిన్నమాట. హృదయ వీణను మీటుతుంది. శేషేంద్ర అనగానే శిల్పం అంటారు. కొంత మంది శిల్పం వుంటే మ్యూజియంలో పెట్టుకోండి వస్తువే ప్రధానం అని కువిమర్శలు చేస్తుంటారు. వీళ్ళకు శేషేంద్ర ఎప్పటికీ అర్థం కారు. అద్భుతశిల్పానికి ఒక్క ఉదాహరణ చూడండి..

**ఇదిగో ఈ నక్షత్రాల క్రింద/కలిశాం మనమొకప్పుడు**
**/పగలు ఎండ తాగి/రాత్రి నీడల్లో**
**సూర్యుడి స్వాదు జ్ఞాపకాలను/నెమరు వేసుకుంటున్న/**
**ఈ చెట్లక్రింద**
**భూగోళం మీద/ఆకలిగొన్న మిలియన్లు చేసే**
**అనంత/ప్రయాణంలో పాల్గొంటున్న/ఈ నక్షత్రాల క్రింద/మనం కలిశాం.**

శేషేంద్ర కవిత్వవాక్యం నిప్పులాగానూ, అగ్నిపర్వతం లాగానూ ఎగసిపడుతుంది. తెలుగు సాహిత్యంలో ప్రతీ కవి కవిత్వానికి నిర్వచనాలిస్తుంటారు. వారి వారి దృష్టికోణాల్లోంచి కవిత్వమిలా ఉండాలని, ఇలా అంటే బాగుంటుందని వివరణలూ, విశ్లేషణలూ చేస్తుంటారు. కానీ శేషేంద్ర కవిత్వంలోని ప్రతి పదమూ కవిత్వ నిర్వచనమే. ఎలా చెప్పగలరని అన్నప్పుడు జ్ఞానపీఠపురస్కార గ్రహీత సినారె ఆధునికాంధ్ర కవిత్వము'సాంప్రదాయలు ప్రయోగాలు అనే సిద్ధాంత గ్రంథంలో కవిత్వానికి పాశ్చాత్య కవులిచ్చిన అనేక నిర్వచనాలు ఇచ్చారు. వాటితో శేషేంద్రకవిత్వాన్ని పోల్చి చూసినపుడు మన భారతీయకవులేం తక్కువకాదని తెలుస్తుంది. ఈ మండే సూర్యుడిలోనే అటువంటి నిర్వచనాలను పరిశీలిద్దాం.

అనుభూతి:



Poetry is the spontaneous overflow of powerful feelings-Wordsworth

**'మా నరనరాల్లో రక్తమై/ప్రవహిస్తున్న నీ కాంతిమండలం/నిద్రిస్తున్నా ఆగదు'**

వర్డ్స్‌వర్త్ ఇచ్చిన ఈ నిర్వచనంలో ఆయన కోరుకున్నది తీవ్రమైన అనుభూతులతో కవిత్వం విజృంభించాలంటారు. మరి శేషేంద్ర పై కవితాపంక్తుల్లో ఆ విజృంభణ కానరాదా? ఇది కదా కవిత్వమంటే అనేలా పై కవితా పంక్తులున్నాయి. కవి శేషేంద్ర వెంటనే ఆకస్మికమంటామా? యాదృచ్ఛికమందామా? ఏదైనా సరే స్పాంటేనియస్‌గా అనుభూతినిచ్చే కవితలు ఈ పుస్తకంలో చాలా చోట్ల కనబడతాయి.

## ఊహాశక్తి:

In a general sense may by defined as the expression of the imagination-Shelly

**చెట్లలో సూర్యుడు/మేఘాల్లో సూర్యుడు/జలాల్లో సూర్యుడు**



©Saatyaki

**/ఆకాశంలో సూర్యుడు/లోపల సూర్యుడు వెలుపల సూర్యుడు/**
**సూర్యుడు నా గోళ్ళలో ఉదయిస్తాడు./**
**చెట్లు/లక్షలాది ఆకులతో/ఎండ తాగుతాయి.**

షెల్లీ చెప్పిన ఊహ పై కవిత్వంలో కనబడిరదా? సూర్యుడు గోళ్ళలో ఉదయించడమేంటి? ఇది కదా కవిత్వమంటే. ఊహ ఎంతమధురంగా వుందికదా? శేషేంద్ర చెప్పినట్లు చెట్లలో, జలాల్లో, ఆకాశంలో వెలుపల, బయట సూర్యుడు కనబడొచ్చు, ఇది సాదారణం కావచ్చు. కానీ లక్షలాది ఆకులతో చెట్లు ఎండ తాగడమేమిటి? అందుకే నేను శేషేంద్ర కవిత్వంలోని ప్రతి పదమూ కవిత్వ నిర్వచనమని అన్నాను.లయ

The rhythmic creation of Beauty-E.A.Poe

**ఏ రస్తా యుద్ధాలు చేస్తుందో/**
**ప్రాణాల్ని ఆటబంతుల్లా విసిరేస్తుందో**
**/గెలుస్తుందో ఓడుతుందో కానీ ముందుకు పోతుందో**
**అదే నారస్తా/**
**ఏ రస్తాలో సంకెళ్ళు కూడా సవాల్ చేస్తాయో**
**/ఏ రస్తాలో అపజయం కూడా అగ్నిజ్వాలై మండుతుందో**
**/ఏ రస్తాలో మరణం /మహా ప్రబంధంగా ప్రతిధ్వనిస్తుందో /అదే నారస్తా.**

ఎడ్గర్ ఎలన్ పో చెప్పిన కవిత్వ నిర్వచనం ఒక లయబద్ధమైన సౌందర్య సృష్టి పై కవితలో కనబడిరదా? సాదారణ వస్తువును అసాదరణంగా మలచడమే కాక సంగీతాత్మకంగా, లయబద్ధంగా మలచడం అద్భుతమైన శిల్పసౌందర్యానికి సంకేతం.

## శబ్దం:

By Poetry we mean the art of employing words in such a manner as to produce an illution on the imagination, the art of doing by the means of words the painter does by means of colours-Macaulay

**తోటలో వసంతం/గుండెలో గ్రీష్మం**
**/ఎటు పోవాలో తెలీని/బాటసారిని/**
**నా వాక్యం/ఒక పిల్లనగ్రోవి**
**/లోపల గాలితప్ప అర్థం ఉండదు/**
**గొంతు మాత్రం/ఎందుకు తియ్యగా ఉంటుందో**
**తెలీని/దిక్కుమాలిన/పాటని..**

శబ్దమంటే ఇక్కడ పదమనే అర్థం. పై కవితా వాక్యాల్లో ఇంగ్లాండ్‌కు చెందిన మ్యాకులే చెప్పినట్లు వొక భావనాశక్తిని, భ్రమలతో, భ్రాంతులతో నింపి పదప్రయోగం చేయడం చూస్తాం. మ్యాకులే కవిత్వానికి చిత్రకారుడు వర్ణముల ద్వారా సాధించుదానిని శబ్దములతో సాధించు కవిత్వమని నిర్వచించినందున ఆ శబ్దం, ఆ భ్రమ, ఆ భ్రాంతి రంగురంగుల వర్ణచిత్రాన్ని చిత్రకారుడు గీచినట్లుంది.

## వ్యక్తీకరణ:

The most delightful and perfect form of utterance that human words can reach-Arnold

**వర్షం వెళ్ళిపోయింది మబ్బుల రథాలెక్కి**
**/నాగలి/భుజాన వేసుకుని వస్తున్నాడు**
**సూర్యుడు/కొండ శిఖరాలెక్కి**
**/జలదానం చేసిన మేఘాలకి జోహార్లు చెప్పాయి చరాచరాలు**

పైన పేర్కొన్న నిర్వచనంలో మాథ్యూ అర్నాల్డ్ చెప్పినట్లు కవిత్వం చదువుతుంటే కలిగే సంపూర్ణమైన ఆనందం పైన శేషేంద్ర చెప్పిన కవితావాక్యాల్లో తెలుస్తుంది. ఎంత గొప్పగా కవితను అభివ్యక్తీకరించారో చూడండి మబ్బుల రథాలనెక్కి వాన వెళ్లిపోవడమేమిటి? సూర్యుడు నాగలిని భుజాన వేసుకుని రావడమేమిటి? ఇది చదువుతుంటే ఎంత సంతృప్తి ఆనందం కలుగుతుందో కదా. ఇది కదా కవిత్వమంటే అనిపిస్తుంది.

ఇక మన కవులు నిర్వచించిన కవిత్వ నిర్మాణ పద్ధతులు మండే సూర్యుడు ఈ కవిత్వంలో ఏమున్నాయో చూద్దాం.

## ఎత్తుగడ:

ఏ కవితకైనా ఎత్తుగడ ప్రధానం. కవితలోని తొలిపంక్తులే ఎత్తుగడ. గొప్పకవిత ఎప్పుడు ప్రజలు నాల్కలపైకి చేరుతుందంటే ఆరంభ వాక్యాలే. శేషేంద్ర కవిత్వంలో ఏ కవితైనా తీసుకోండి ఎత్తుగడలు సాదారణంగా ఎప్పుడూ ప్రారంభించరు. ప్రతీ కవిత అద్భుత ఎత్తుగడలతోనే ప్రారంభమౌతుంది. ఎలాగో చూద్దాం.

**ఆకాశాన్ని ముడిచివేసి/ దిగంతరేఖ నాలోకి దిగింది/ నిలువుగా..**

చూశారుకదా ఎత్తుగడల కవిత్వనిర్మాణం. వాస్తవానికి ఏ కవి కవిత్వ నిర్మాణ పద్ధతులు ఇలాగుండాలని చెప్పకపోయినా మనకు మనం ఇలా వుండాలని నిర్ణయించుకుని రాసినప్పుడు కవిత్వం జనరంజకమౌతుంది. దిగంతరేక అనే పై కవితలో ఎత్తుగడలోనే కవి వందశాతం విజయం సాధించారు.

వస్తువు:

ఏ కవితలోనైనా వస్తువు, రూపం శిల్పం ఉంటాయి. ఉండాలి కూడా. అదే గొప్ప కవిత అవుతుంది. ఇక వస్తువును గూర్చిమాత్రమే మాట్లాడాలనుకున్నప్పుడు సాహిత్యానికి మార్క్స్ సిద్ధాంతం పునాది అయినతర్వాత వస్తువు ప్రజాపరమైంది.ప్రజలపక్షాన నిలబడే వస్తువే ఇప్పుడున్న కవులకు వస్తువు.

**కలల రక్తనాళాల్లో రక్తం కాదు/ భావితరాలకోసం బలైన ప్రాణాలు ప్రవహిస్తున్నాయ్/ ఎవరి గుండెల ఉయ్యాలల్లో ఊగిసలాడిన/శిశువులో**
**వారి సమాధుల మీద/పూలై రాలడానికి/ గాలితో కలిసిపోతున్నాయ్**
**/కాగితాల పడవల్లో/కలలు ప్రయాణాలు చేస్తున్నాయ్(నా దేశం వెన్నముక)**

ఇంతకంటే గొప్పవస్తువు ఇంకేం కావాలి. వస్తువు వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. అలా ప్రతిబింబించినపుడే వస్తువు వైవిధ్యంగా సాగుతుంది. ఏ కవి కవిత్వం రాసినా ప్రజలపక్షాన నిలబడి కలం పట్టినప్పుడు కవిత్వానికి వస్తువునదే అందిస్తుంది.

## శిల్పం:

వస్తురూప శిల్పాలను వేరు చేసి సాహిత్యాన్ని చూడలేమంటారు. ఇక శిల్పమే ప్రధాన చర్చ కాబట్టి శేషేంద్ర కవిత్వం నిండా శిల్పం వందశాతం పేర్చబడి వుంటుంది. దానికి ఉదాహరణగా ఈ కింది కవిత చూడండి.

**ఈ నేల నా రక్తం తాగాలని దప్పిగొన్నది/**
**ఆముదపు చెట్ల నీడల్లో/హాయిగా నిద్రిస్తున్న ఈ దేశానికి**
**/ సూర్యుడిలో కలం ముంచి గ్రీష్మగీతం/రాద్దామని తెల్లకాగితం పుచ్చుకున్నాను.**

శేషేంద్ర కవిత్వంలో వొక కవితా వాక్యం మాత్రమే. శిల్పం విషయంలో ఇంకెవ్వరూ రాయని విధంగా శేషేంద్ర కవిత్వంలో శిల్పం వుంటుంది. శిల్పం లేకపోతే ఏ వస్తువు

శేషేంద్ర కవిత్వంలో వొక కవితా వాక్యం మాత్రమే. శిల్పం విషయంలో ఇంకెవ్వరూ రాయని విధంగా శేషేంద్ర కవిత్వంలో శిల్పం వుంటుంది

సాహిత్యం కాదని సాహిత్యకారులంటారు. గొప్ప శిల్పం ఉన్నప్పుడే అది గొప్ప కవిత్వం అవుతుంది. శేషేంద్రపట్ల ఎవరికెన్ని భిన్నాభిప్రాయాలున్నా శేషేంద్ర శిల్పం చదివారంటే చాలు వొక్కసారిగా మైమరచిపోతారు. వర్తమాన కవుల్లో అతికొద్దిమంది మాత్రమే శిల్పంతో రాయగలుగుతున్నారు. ఆ శిల్పాన్ని శివారెడ్డో, దర్భశయనమో సుధాకరో ఇలా కొంతమందిలో మాత్రమే చూస్తాం.

శిల్పాన్ని లోతుల్లోకి వెళ్ళి పరిశీలించి చూసినపుడు ఇది ఇతివృత్తాన్ని ఆశ్రయించివుంటుంది. అందుకే శేషేంద్ర కవిత్వంలో ఇతి వృత్తం అంతర్లీనంగా దాగి పలకరిస్తుంటుంది.

ఇలా చెప్పుకుంటూపోతే శేషేంద్ర కవిత్వంలో అనేక కవిత్వనిర్మాణపద్ధతులన్నీ వుంటాయి.

అందుకే కొత్తకవులు కనీసం శేషేంద్రనైనా చదివి గొప్పకవిత్వం రాయాలని భావిస్తున్నాను.

మానవుడు నవసమాజం గమ్యాన్ని చేరడానికి చాలాకాలం పట్టొచ్చని శ్రీశ్రీ ఎందుకన్నాడోగానీ యాభైఏళ్ళ క్రితమే ఈ కవిత్వం నుండి నవసమాజానికి శేషేంద్ర దారులు పరిచారు.



-కెంగార మోహన్
9493375447



-డా॥రావి రంగారావు
9247581825

అంశం: : చందాలివ్వండి బాబూ, చందా లివ్వండి
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో ॥రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
"వారం వారం కవితల వర్క్ షాప్" 35కు మొత్తం 13 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 4 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

### చందా విశ్వరూపం

చందా
అడుక్కోవటానికి మర్యాద పదం
చందా
చెప్పుకోవడానికి అందమైన పధం
చందా
చేయలేనిపనిని చేయించే పన్నాగం
చందా
తిరిగివ్వకుండా లాక్కునే ఊడిగం
చందా
దేవుణ్ణి చూపించి చేసే క్షుద్ర పూజ
చందా
పెట్టుబడి లేని వ్యాపారపు బాజా
చందా
మర్యాదకి, అమర్యాదకి మధ్యనుండే తేడా
చందా
కనిపించని కత్తి బెదిరించే జాడ
చందా
పన్ను ఎగ్గొట్టేవారిని సేవకులుగా చూపిస్తుంది
చందా
పనులు ఎగ్గొట్టేవారిని నాయకులుగా నిలబెడుతుంది
చందా
దారిలో అడ్డదారిని వెతికేలా భయపెడుతోంది
చందా
అకౌంట్లలో బొక్కలు పూడుస్తుంది
ఎన్ని రూపాలలో ఉన్నా....
చందా....అందరినీ వెంటాడే అయిష్టపు నీడ
ప్రతి వారి జీవితంలో తోడుండే లెక్క తేలని పీడ.

-శ్రీఆరుణం శ్రీనివాస్

### చందా లివ్వండి

నిన్న
రవి అస్తమించని రాజ్యం పడగ వీడి
స్వేచ్ఛా విహంగాలుగా ఎగిరేందుకు
ఉద్యమాలలో నిలువుదోపిడీ లిచ్చిన వారెందరో
మానవతకు నిలువెత్తు రూపాలు వారు,
కరోనా వైరస్ కబళిస్తున్న వేళ
దాతృత్వం తో విరాళాలిచ్చి కరుణతో
వదాన్యులై నిల్చిన పారిశ్రామిక దిగ్గజాలెందరో
ఆకాశన వెలిగే ధ్రువతారలు వారు,
ప్రకృతి విలయతాండవ మాడే వేళ
అన్నామో రామచంద్రాని అలమటించేవారికి
ఆపన్నహస్త మందించి అక్షయపాత్రలైన వారెందరో
జగతి ప్రగతికి రథ సారధులు వారు,
నేడు
కల్లోలాలు ఉవ్వెత్తున ఎగసే వేళ
అక్రమార్జనలు తమ ఖజానాలో పొంగి పొర్లుతున్నా
కీర్తికాంక్షలకై వెంపర్లాడుతూ
ఉడుత సాయాన్నందిస్తూ
సమాజానికి ఊపిరుల్లా ఊసులాడే వారెందరో
శకుని మాయలు పన్నే మహేంద్రజాలికులు వీరు
కరువు కాటకాలు కమ్ముకున్న వేళ
వసుధైక కుటుంబానికై మన సాయమంటూ
ప్రకటనల్లోని హోరు పంపిణీల్లో పారదర్శకత
చూపని
పాత్రికేయులెందరో
మల్లెల మంచు ముసుగులో దుర్గంధం వెదజల్లే
అసహజ పరిమళాలు వీరు
సమాజాలయానికైనా, విగ్రహాలయానికైనా
ఏ కార్యాలకైనా వసూలైన విత్తం
సక్రమంగా వెదజల్లితే మానవత్వపు
చిగురులు మారాకు వేస్తూనే ఉంటాయి, లేదంటే
దానవత్వపు చురకత్తులు మొలిచి
సత్యం, ధర్మం ను నేలకొరిగిస్తూ
సమాజపు అస్థిత్వాన్ని త్రిశంకుస్వర్గపు
దారి మళ్ళిస్తాయి

- మేడిశెట్టి సుభద్రా కృష్ణ

### మిని కవితలు

#### దందాలు

పన్నులు కావవి!
ప్రజలు చెల్లిస్తున్న
చందాలతో
పాలకులు సాగిస్తున్న
దందాలు!!

#### వార్షిక చందా

ఏకపక్ష వార్తలను
ఏకధాటిగా
ప్రచురిస్తున్నాక గాని
తెలియలేదు!
తాను చెల్లించిన
వార్షిక చందా
పత్రికకు కాదు ..
పార్టీకి అని!!

#### చందాలు

చందాలన్నీ ...
ప్రార్థనా మందిరాల
పాలరాతి కట్టడాలకే!
పాల కోసం
అలమటించే
పేద పిల్లల
ఆకలికి కాదులే!!

#### వసూళ్లు

దాతల పేర్లు
శిలాఫలకంపై
వేస్తామన్నారు!
విరాళాలు వరదలా
పారాయి!!

#### నింద నిజమే

అయ్యో 'పాపం'!
ప్రతి ఏటా
ఎంత చందా
చదివించినా ?
తను అవినీతిపరుడనే
నింద మాత్రం
చెదరడం లేదు!

-టి. ధనుంజయ రెడ్డి,

### చందాలు మంచికే

చందాలు ఇవ్వండి బాబు,
చందాలు ఇవ్వండి,
సంఘ సేవకు స్వచ్ఛమైన
వెలుగులు నింపండి.
ఆశయ దీపమై వెలిగే ప్రతి కార్యం,
అన్నదానమై చిగురించే ప్రతి హృదయం,
అణగారిన వారికో రక్షణ కావాలి,
ఆ రక్షణకై మీ చందాలు కావాలి.
చందాలు ఇవ్వండి బాబు,
చందాలు ఇవ్వండి,
జీవిత గాథలో
మమకారాన్ని చిమ్మండి.
విద్యకు వెన్నుపూసగా మీ సహాయం,
రోగి కళ్ళలో వెలుగునిచ్చే ఔదార్యం
సేవలో నిండిన సంతోషం శాశ్వతం,
దానం చేసినది అమరత్వం.
చందాలు ఇవ్వండి బాబు,
చందాలు ఇవ్వండి,
ప్రేమతో పంచితే
మనసులు కలిపండి.
చిన్న నాణెం పెద్ద మార్పు తెస్తుంది.
చిన్న దానం మహా సేవగా నిలుస్తుంది,
చిరు వర్షపు నీటిలోనూ తామర వికసించదా
అలాగే మీ చందాలోనూ ప్రపంచం వెలుగదా
చందాలు ఇవ్వండి బాబు,
చందాలు ఇవ్వండి,
దానం చేసిన చేతులే
దైవమై నిలుస్తాయి.
ఆనంద జ్యోతి పంచే ఈ పంథాలో,
నడిచే ప్రతి అడుగు పుణ్య దామమే
ఇతరుల కోసమే జీవించే మనసు,
మనిషితనం అందించే
నిజమైన వెలుగుకాదా
చందాలు ఇవ్వండి బాబు,
చందాలు ఇవ్వండి,
సేవా మార్గంలో
సువాసనలు చిమ్మండి...

-శరకణం కనకదుర్గ

## రామాయణ మహా కావ్యాన్ని మానవ సమాజానికి అందించిన ఆదికవి వాల్మీకి నిత్యస్మరణీయుడు



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య టీ. గౌరీశంకర్

హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి): రామాయణ మహాకావ్యాన్ని మానవ సమాజానికి అందించిన ఆదికవి వాల్మీకి నిత్య స్మరణీయులని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ. గౌరీశంకర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని వాల్మీకి జయంతి గానసభ నిర్వహణలో జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా ఆచార్య గౌరీశంకర్ పాల్గొని మాట్లాడుతూ.. తొలి ఆది కావ్యం రామాయణం అని చెప్పారు. వాల్మీకి బోయవానిగా పక్షుల ను వేటాడి జీవించే స్థితి నుండి జాతికి మార్గదర్శనం చేసే మహా ఇతిహాస సృష్టికర్తగా తరాలు గడిచినా యుగాలు మారినా నిలిచి వున్నారని ఆయన వివరించారు.

గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై బోయ హక్కుల సమితి అధ్యక్షుడు గోపి వాల్మీకి, వాల్మీకి సంస్థ అధ్యక్షుడు బొగ్గు వెంకటేష్, రచయిత మిద్దె సురేష్ పాల్గొన్నారు.

## సంక్షిప్త రామాయణం, సుందరకాండం సప్తపదుల సంపుటి ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు


హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి):మహిత సాహితి శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త అధ్వర్యంలో శ్రీమతి సత్యవతి దిన వహి గారు రచించిన సంక్షిప్త రామ యణము మరియు సుందరాకాండము సప్తపదుల సంపుటి ఆవిష్కరణ ఆదివారం ఉదయం పది గంతలకు గుండవరపు హనుమంతరావు వేద్దిక , త్యాగరాఅగానసభ ప్రాంగణంలో ఎంతో ఆత్మీయంగా జరిగింది. సప్తపది సృజన కర్త శ్రీ సుధామ అధ్యక్షతన ప్రముఖ కథా , రచయిత విమర్శకులు, కవి శ్రీ విహారి గారు ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా పుస్తకాన్ని ఆవిష్కరించి సాహిత్య విలువల గురించి చక్కని విషయాలు ప్రస్తావించారు. శ్రీమతి సుందరీ నాగమణి పుస్తకాన్ని జన రంజకంగా సమీక్షించారు. రచయిత్రి తన సాహి తీ ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు. మహితసాహితి అధ్యక్షురాలు శ్రీపాద స్వాతి, కార్యదర్శి శిష్ట్లా మాధవి కర్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్ష్యులు సప్త పదుల ఉద్భవం గురించి వేగంగా విస్తరిస్తూ పుస్తకాలు పుస్తకాలుగా వ్యాప్తి చెందడం గురించి చెప్పారు. మహిత సాహితి ఎలాటి ధనాపేక్ష లేకుండా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహితి సేవ చేస్తోంది. ఆసక్తికరంగా సాగిన కార్యక్రమం మాధవి గారి వందన సపర్పణతో ముగిసింది.

నాటి తరం వారి కథలు నేటి తరానికి

## కథల వంతెన

# బ్రతుకు తిరగని మలుపు

(కథ)



- కూర చిదంబరం
సెల్: 8639338675

1970లో రాసిన కథ

రైలు కట్టమీది నుండి ట్రెయిన్ "ధణ ధణ" మంటూ వెళ్లిపోయిన చప్పుడుకి వీరప్పకు మెలకువ వచ్చింది. చుట్టూ ట్రెయిన్ విడిచిన పొగ వాసన. రివ్వున వీచే చలిగాలి బల్లెంలా పొడిచింది. నాభి దగ్గర నుండి ఎగేసుకు వస్తూంది, దవడలు టకటక కొట్టుకున్నాయి.

అంతదాకా హాయిగా రక్తపానం చేస్తున్న దోమలు,

> "ఎక్కడినుండో ఇంత పసుపు కొమ్ము, పచ్చదారం పట్టుకొచ్చి, మెళ్లో కట్టించుకుంది. అదే వారికి పెళ్లి. తూతూ బాజాలు, అలంకరణ, అతిథులు హడావిడి ఏమీ లేకుండానే వారు పెళ్లాం మొగుళ్లయిపోయారు"

వీరప్ప కదిలాడన్న కోపంతో గుయ్ మంటూ ఎగిరాయి.

దూరంగా జరిగిపోయిన కంబళి మీదకు లాక్కోబోయాడు. కాని, లచ్చిమి, దాని పక్కలో పిల్లాడూ జ్ఞప్తికి వచ్చి. ప్రయత్నం విరమించుకుని, కాళ్లూ చేతులూ డొక్కలో అదుముకుని పక్కకు ఒత్తిగిలాడు.

అదును చూసి దండెత్తిన పగవాడిలా వీస్తూంది. వేళ్లు కొంకర్లు పోయి, కడుపులో ఏదో గడ్డ కట్టుకుపోయినంత చలి వేసింది.

వీధిదీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పొగమంచు దట్టంగా పడటం మూలాన, కన్నీరు నిండిన కళ్లతో చూసినట్లు అంతా మసకగానే ఉంది. క్లాకటవర్ "రెండు" అంది.

తల ఎత్తి, కళ్లు నులుముకుంటూ పరకాయించి చూశాడు వీరప్ప. మునిసిపాలిటీ కుండీల్లోని చెత్తా చెదారం జమ చేసుకుని మంట కాగుతున్న వేరే బిచ్చగాళ్లు కనిపించారు. తలకింది గోనెపట్టా పై కెత్తి, చేత్తో తడుముకుని సగం మిగిలిపోయిన బీడీ ముక్క తీసి మంటవద్దకు నడిచాడు.

"ఏం, వీరప్పా! నిద్ర పట్టడం లేదా?" అడిగాడు రాజాలు.

వీరప్ప జీవితంలో లచ్చిమి ప్రవేశించకముందు రాజాలూ, వీరప్పా ప్రాణ స్నేహితులు. రాజాలును వదిలి వీరప్ప సంసారమనే మరో మెట్టు అదనంగా ఎక్కాడు. ఇద్దరి మధ్యా ఎడం ఎక్కువయిపోయింది.

మౌనంగా గల అడ్డం తిప్పి, మంటలోంచి ఓ కొరకంచు లాగి అంటించుకున్నాడు. కంబళీ లేని వాళ్ల శరీరాలు, అలా రాత్రంతా మంట ముందు గడపవలసిందే! కాల్చటానికి మరేం మిగలకపోయినా, వారు పడుకోరు. వెచ్చని బూడిదలో చేతులు దూర్చి కబుర్లాడుకుంటారు.

మంట తాలూకు వెలుతురు కిరణాలు వారి గడ్డాల్లోకి, చిరిగిన దుస్తుల కంతల్లోకి చొచ్చుకుపోయాయి. నీడలు రోడ్డు మీద పొడుగ్గా పడి, మంట కదిలినప్పుడల్లా ప్రేతాలకి ప్రాణం వచ్చినట్లు కదులుతున్నాయి.

లచ్చిమికి, పిల్లాడికి దుప్పటి సరిగా కప్పి, గోడకు చేరగిలబడ్డాడు వీరప్ప. వేడి పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లి.. హృదయంలోని ఆలోచనల్ని కరిగించి, మనసులోకి తోసింది.

'నేను ఎప్పుడు, ఎవరికి పుట్టాను?' అని గొణుక్కున్నాడు.

అలా ప్రశ్నించుకోవటం అతనికి మామూలే. గతాన్ని నెమరేసుకుంటూ, కదలనంటున్న ఒక్కొక్క క్షణాన్ని గడ్డుగా కదిలించేవాడు.

నేడూ అంతే..

తనెక్కడ పుట్టాడో తనకే తెలీదు. తెలిసిందల్లా– చుట్టుముట్టూ ఉంటున్న బిచ్చగాల్లు. రాజాలు, అప్పుడప్పుడు ప్రేమగా పిలిచి ఇంత పెట్టే ముసలి ధర్మవ్వ మాత్రమే.

ఎడమ మోకాలు కిందనుండి మడమల దాకా చీపురు పుల్లలా ఉంది. చంకల క్రింద ఊతకర్రలతో నడిచినప్పుడు జీవంలేనట్లు ఊగేది తప్ప, మరెందుకూ పనికొచ్చేది కాదు.

కుంటికాలు గురించి నలుగురూ నాలుగు రకాలుగా అనేవారు.

ఏదో ఓ రకంగా అవిటివాడు అయితే తప్ప, జీవనోపాధి గడవదని వాళ్లమ్మ విరిచేసిందిట!

పుట్టుకతోనే అలా ఉందిట.

చిన్నతనంలో ఏదో జబ్బు వచ్చి అలా అయిందిట.

అతన్ని పెంచిన ధర్మవ్వకూడా చివరి మాటే బలపరిచేది.

తల్లి ఎవరో తెలీదు. ఆమె గురించి కూడా రకరకాలు గాథలు.

ఎవర్నో లేవదీసుకుపోయిందిట.

తరిగొండ తిరునాళ్లలో అడుక్కుంటూ కనిపించిందిట.

మరెవరికో, మరెక్కడో కనిపించదట! తండ్రి గురించి ఎవరికీ ఏం తెలీదు అంచేత ఏమీ అనుకోవటానికి వీల్లేకపోయింది.

తనకి తెలిసిందల్లా ఒక్కటే– అడుక్కోవటం, కుంటికాలు అందుకు బాగా సహకరించింది.

సుప్రభాతపు పాట వినబడుతూండగా లేచి, కుళాయి వద్ద ఇన్ని నీళ్ళు ముఖం మీద దొర్లించుకుని, రాజరాజేశ్వరుడి కోవెల మెట్ల వద్ద కూచునేవాడు. మాసిన తల, గడ్డం, మట్టికొట్టుకుపోయిన చింకి పేగులు ఒంటిమీద వేళ్లాడుతూండగా దీనంగా భక్తుల కళ్లలోకి చూస్తూ అడుక్కునేవాడు.

ఈసడించుకుంటూనే, మరి కొంత పుణ్యం సంపాదించుకోవటానికి భక్తులు కాసులు విదిల్చేవారు.

సూర్యుడు నీడల్ని పూర్తిగా కాళ్లకిందికి తరిమే వేళకు లేచి, కోమలా విలాస్ దొడ్డి ద్వారం వద్ద కాపు వేసేవాడు. పులి విస్తరాకుల గురించి అతనికి, ఊరకుక్కలకు పోటీ..

తమ నోటిముందరి కూడు, తమకంటే బలమైన జంతువైన ఈ మనిషి లాక్కోవటం చూసి, వెనక కాళ్ల సందున తోక ముడుచుకుని పళ్లు చూపిస్తూ, నిస్సహాయంగా మొరిగేవి.

మట్టి కొట్టుకుపోయి, అనాచ్ఛాదితమైన ఒళ్లూ, ఆలోచించనవసరం లేని మెదడు. జీవితాంతర్యమేదో తెలుసుకోలేక బ్రతుకుతున్న ఆ రోజుల్లో అతనికీ, పశువుకీ అట్టే తేడా లేకపోయేది.

లచ్చిమి ఏదో గొణిగింది నిద్రలోనే. జారిపోయిన కంబళీ తిరిగి ఒంటిమీదికి లాక్కుంటూ, పిల్లవాణ్ణి పొదువుకుంది.

ఆ రోజుల్లో, కోవెల వద్ద అడుక్కోడానికి కూచునే వాళ్లలో లచ్చమిదో ప్రత్యేకత. తన వాళ్లకు కాస్త ఎడంగా, పై మెట్టు మీద కూచునేది. భక్తులు మొదటి నలుగురైదుగురికి తలో కాసింతా వేసి, మిగతావారికి లేదంటూ పోయేవారు కనక, లచ్చిమికి అందరికన్నా రాబడి కొంచెం ఎక్కువే. అందుకే దాన్ని చూస్తే కన్నెర్ర. లచ్చిమిని ఏడిపించాలని, దాని జాగాను స్వాధీనం చేసుకోవాలని ఉండేది. కాని, దాని నోరు మహాదురుసు. నోటికి జడిసి ఎవరూ దగ్గరికేనా వచ్చేవారు కాదు.

యౌవనం తొలి మలుపు తిరగని చిలిపితనం ఇంకా పోని రోజులు.. తనలో ఏదో ప్రత్యేకత ఉందనీ.. అందరిలా కాదనీ అనుకునేవాడు వీరప్ప.

నిజంగా ప్రతి వ్యక్తీ అంతే! ఆ ప్రత్యేకత లేనిది బ్రతుకుకు అర్థమే లేదు.

వీరప్పకి పురెక్కించారు. తోటి బిచ్చగాళ్లు.. నిజంగా మొగాడివే అయితే, చేవగాని ఉంటే లచ్చిమి ముందు చూపమన్నారు.

ఉక్రోషం వచ్చి నరాలు పొంగాయి వీరప్పకి. పట్టుదల హెచ్చింది. 'ఏమైనా సరే! ఈ సవాల్ని ఎదుర్కోవాలి. నా గొప్పతనమేదో వీళ్లకు తెలియచూపాలి' అనుకున్నాడు.

> 'ఏమైనా సరే! ఈ సవాల్ని ఎదుర్కోవాలి. నా గొప్పతనమేదో వీళ్లకు తెలియచూపాలి'

ఆ రోజు కావాలనే ముందుగా వెళ్లి లచ్చిమి ఎప్పుడూ కూచునే చోట కూర్చున్నాడు.

లచ్చిమి దూరాన్నుండే చూసింది. కోపంతో కొరకొరలాడుతూ వచ్చి, చేయి పట్టుకు లాగింది.

వీరప్ప కదల్లేదు. నిమ్మకు నీరెత్తినంత నిశ్చలంగా ఉండి, "ఇంత ప్రేమగా పెళ్లాం తప్ప మరెవ్వతే నా చేయి పట్టుకునేది, లచ్చిమీ." అన్నాడు. దాన్ని ఉడికించాలనే తప్ప మరో ఉద్దేశం లేదు.

ఏదో జరుగుతుందని అందరికీ తెలును! ఆత్రంగా వింటున్న వారంతా భళ్లున నవ్వారు.

లచ్చిమికి ఉడుకుమోత్తనం, కోపమూ వచ్చాయి. చురచుర చూస్తూ, "అంత మగాడివైతే, మనువాడరాదూ" అంది.

ప్రేక్షక వర్గం రెండుగా చీలింది. "భేష్! లచ్చిమి, మా బాగా గడ్డెట్టావు" అంది ఒక వర్గం.

అంత మాట అన్నందుకేనా పెళ్లాడాలని తీర్మానించింది మరోవర్గం.

వీరప్పకేం తోచలేదు. ఏదో నవ్వుతాలూకు అన్నాడు. అదీ, తానూ, నాలుగు మాటలు అనుకుంటామనీ, పైబడి కొట్టబోయినా, తనదే పై చేయి అనీ అనుకున్నాడు. కాని, అనుకోకుండా అలా పరిణమించింది.

ఎక్కడినుండో ఇంత పసుపు కొమ్ము, పచ్చదారం పట్టుకొచ్చి, మెళ్లో కట్టించుకుంది. అదే వారికి పెళ్లి. తూతూ బాజాలు, అలంకరణ, అతిథులు హడావిడి ఏమీ లేకుండానే వారు పెళ్లాం మొగుళ్లయిపోయారు.

ఎత్తుగా కట్టిన రైలుకట్టకింద గూళ్లలా కట్టారు. అందులో ఒకటి వాళ్ల ఇల్లు. గోడకు దిగ్గొట్టిన చీలకు తగిలించిన చింకి పోగుల మూట. ఓ గిన్నె, చిన్న ముంత– ఇదీ వాళ్ల సంసారం.

రావి చెట్టుకు కూడా చలేసిందేమో, సన్నగా రాగం తీయటం ప్రారంభించింది. గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న మిణుగురు పురుగుల మంటలో అది కూడా చలి కాచుకోనారంభించింది.

బీడీ అయిపోవచ్చింది. కాని ఆబ తీరలేదు. మరోటి ముట్టించి పీక నేలమీద వదిలాడు. పవడంలా మెరుస్తూంది నిప్పు. రానురాను మెరుపు తగ్గిపోయి ఆరిపోయింది.

'జీవితం ఇంతే'.. అనుకున్నాడు. ఆగిపోయిన ఆలోచనలకు వేడి, ఊపిరి పోసింది.

అతని సంపాదనేదో అతనికి ఉండేది కనక, కొత్తలో లచ్చిమి బరువనిపించలేదు. పైపెచ్చు ఏదో ఆనందం, సంతోషమూను. జబ్బు పడటంతో, లచ్చిమి పూర్తిగా వీరప్ప మీదే ఆధారపడింది.

ఎంత అరిచి గీమాలినా, పదేను పైసలకంటే ఎక్కువ దొరికేవి కావు. దాంట్లోని పది పైసలు, ఒక్కోరోజు కొరియర్ ముసలమ్మ వాటా, ఆవిడ దగ్గరే వున్న గవర్నమెంటాఫీసు క్లర్కులకు రోజూ కారియర్లు మోసేది. వాళ్లు తినగా, మిగిలిన అన్నం కూడా, వీళ్ల మధ్య అమ్ముకునేది. అలా తిన్న రోజు లచ్చిమికి ఇవ్వటానికేమీ మిగిలేవి కావు.

కాల్చి పారేసిన పీకలు తప్ప, డబ్బులతో పొగ తాగటం తాహతుకు మించిన పని. ఇదివరకైతేన, రోజుకు పదేనా రంజుగా ఊదిపారేసేవాడు.

రోగంతో లచ్చిమి పూర్తిగా కదల్లేని స్థితికి వచ్చింది. దుమ్ము కొట్టుకుని, మాసిన నల్లటి బట్టలనిండా చెమటకంపు, చీమునెత్తుటి నీచువాసన. వీరప్ప ఏం చేయలేకపోయేవాడు. గవర్నమెంటు ఆసుపత్రి చుట్టూ ఎంత తిరిగినా, రంగునీళ్లు దొరికేవి. 'బిచ్చగాళ్ల రోగాలకి కూడా మందులా?" అని విసుక్కునేవాడు వైద్యుడు, వాళ్లు మాత్రం మనుషులు కానట్లు, సూదిమందు వేస్తే తప్ప, ఫలితం లేదన్నారు. తినటానికే లేని వీరప్ప, 'సూదిమందు ఇప్పించటం కూడానా?" అనుకుని నవ్వుకునేవాడు తనలో తానే.

ఎన్ని గుడ్డలు చుట్టినా, నెత్తుటితో తడిసిపోయేవి మరునాడు. ముఖం కుదించుకుపోయి, ఒళ్లంతా నూనె రాచినట్లు మెరిసేది.

అంతవరకూ అడుక్కుంటూనే ఉంది. తన సంపాదనలోంచి ఓ కంబళీ, గిన్నీ కొనుక్కుంది. కనబడ్డ పేలికనల్లా తీసి, జాగ్రత్త చేసేది.

ఇదంతా చూస్తున్న వీరప్పకేం అర్థం కాలేదు. ఓరోజు ఉండబట్టలేక అడిగాడు. "ఏంటేవ్, లచ్చిమీ! అవన్నీ ఏం చేసుకుందామనీ?"

"మనకో బిడ్డ పుడతాడ్రా వీరప్పా!" అంది.

ఆనాడైతే సంతోషం వేసింది. తనకో బిడ్డ.. తప్పకుండా కొడుకే.. ఆనందంతో రోజంతా వాడవాడకీ తిరిగి స్నేహితులందరికీ చెప్పాడు.

కాని అందులోని ఆనందం ఎంతో తరవాత తెలిసివచ్చింది. 'మనకో బిడ్డ పుడతాడు' అన్న పదం ఇప్పుడు 'మరో బిచ్చగాడు పుడతాడు' అని వినిపించేదేమో!

నిజమే! పుట్టి, తన తల్లిదండ్రుల వృత్తి చేసు కోకుండా మరేం చెయ్యగలడు?

గూడ్సు ట్రెయిన్ కాబోలు, పది నిముషాల దాకా ధణధణమంటూ చెవుల్లో మోగుతూనే ఉంది.

ఆ చప్పుడుకి లేచాడు చంటాడు. గుక్కపట్టి ఏడుస్తున్నాడు. బోర్లకిలా తిప్పి ఎంత జోకొట్టినా మానటం లేదు. ఆకలేస్తున్నదేమో.. లచ్చిమిది రాక్షసినిద్ర. పర్వతాలు విరిగిపడ్డా అయిదవంది లేవదు.

అది రోజూ చెబుతూనే ఉంది. అంత రోగంలో పిల్లాడికి పాలు ఇవ్వకూ దదట.

కాని వీరప్ప ఏం చేయగలడు?

పాలడబ్బాకాని, పాలుకాని కొనాలంటే మాటలా..

మరో జీవిని కూడా అతనే సాకాలన్నమాట.. అమ్మో..

కొనకంటా కాలిన బీడీ, వేళ్లని చురుక్కుమని పించింది. కసిగా విసిరేశాడు.

తనపై పడిన ఒక్కరి బరువే మోయటం ఎలా అని సతమతమౌతున్న రోజుల్లో, మరో బరువు.

కొన్నాళ్లకి మరోటి.

పెళ్లంటే ఇదేనా?

పెళ్లంటే ఏమిటి? నీతి, నిబంధన, సంసారం, పెళ్లాం, పిల్లలు– ఇన్ని బంధనాలు తనకెందుకు? లచ్చిమి తనపై ఓ మెత్తని ఉచ్చు విసిరింది. ముడి ఇప్పుడిప్పుడే బిగుస్తూంది.

కాక, మరేమిటి? తన తలిదండ్రులెవరో తనకే తెలీదు. ఎక్కడో కన్నారు. మరెక్కడో వదిలేసి, చెరో దారిని పోయారు.

లచ్చిమి రాకముందు ఏ బెడదా లేకుండా వెళ్లిపోయేది కాలం. చేతికి దొరికినంత తినటం, ఎక్కడో ఓ చోట పడి నిద్దరోవటం. ఒకరిని గురించి తను బాధపడటం కాని, తన గురించి మరొకరు ఎదురుచూడం కాని లేదు.

లచ్చిమికి, పిల్లాడికి కనిపించకుండా ఎక్కడికేనా దూరంగా పోవాలి. అప్పుడు తన సంపాదన తనకే.. తినచ్చు, తాగచ్చు, ఏం చేశావనీ, ఏదనీ అడిగేవాడుండడు. తన ఇష్టానికి తానే రాజు.

'వెళ్లాలి' అన్న ఆలోచన వీరప్పలో మెరుపులా మెరిసింది. ఆ వెలుతురుకి కళ్లు మిరుమిల్లు గొలిపాయి. రెప్పలు ముడిపడిపోయాయి.

ఊతకర్రలు తీసుకుని, ఒక్కమారు వెనక్కి చూశాడు. తల కింద ఓచేయి, మరోచేత్తో పిల్లాణ్ణి పొదుముకుని నిద్రపోతూంది.

మునిసిపాలిటీ స్వీపర్లు ఊడవటం మొదలెట్టారు. క్షణంసేపు ఆకాశంవేపు చూశాడు. కాటుక నలుపు కొంచెం కొంచెంగా కరిగిపోతూంది. 'అబ్బో! తెల్లారొచ్చిందే..' అనుకుని కర్ర నేలమీద తాటిస్తూ బయలుదేరాడు.

కాళ్లకింది నేల చురుగ్గా సాగిపోతూంది. "హరిఃఓం.." అంటూ సుప్రభాతం ప్రారంభించారు కోవెల్లో. పక్షులన్నీ రానున్న సూర్యుడికి స్వాగతం చెప్పడానికి హడావిడి పడుతున్నాయి.

కాస్సేపు నడిచాడో లేదో, ఎవరో "వీరప్పా!" అంటూ పిలిచినట్లు లీలగా వినిపించింది.

"ఇంకేముందు, అది లేచినట్లుంది. ఆ పిలుపు లచ్చిమిదే" అనుకున్నాడు.

పెద్ద పెద్ద అంగలు వేస్తూంటే, చంకల్లో కర్రలు పొడుచుకుపోయి ఒళ్లంతా కదులుతూంది. ఆయాసం వచ్చింది. నాలుగు కాగానే వీధిదీపాలు ఆరిపోతాయి.

అంతా చీకటి. అంతటి చలిలోనూ ముచ్చెమటలు పోశాయి.

'ఈ మలుపు తిరిగితే, లచ్చిమికి శాశ్వతంగా కనుమరుగవ్వొచ్చు. ఇక నాకు నేనే..' అనుకున్నాడు.

వీరప్ప నడుస్తున్న రోడ్డు ఎడంవేపు తిరిగింది.

అతని చెవుల్లో మారుమోగుతున్నదొకటే పిలుపు– "వీరప్పా! వీరప్పా!" అంటూ ఎనిమిది వేపులా ఎనిమిది లచ్చిమిలు నిలిచి పిలిచినట్లు . కుర్రాడు గుక్కపట్టకుండా ఏడ్చే ఏడుపు వినబడుతూంది. అతని గాభరాలో ఎదురుగా వస్తున్న లారీ సవ్వడి వినిపించలేదు.

మలుపు తిరగబోయేంతలోనే పెనుభూతంలా మెరిసే మిడిగుడ్లతో వేగంగా వస్తున్న లారీ కనిపించింది. తప్పించుకోవటానికి పక్కకు వాలిపోయాడు. బరువంతా ఎడంవేపు వంగింది. అనుకోటానికి కాలు ఓపగలిగితే కద! మడమ మెలిక తిరిగింది. కిందపడి పోయాడు.

×××

కాస్సేపటికి స్పృహలోకి వచ్చాడు. ఎక్కడో దూరాన రైలుకూత.. పట్టాలను బలంగా తన్నుతూ పోతూన్న శబ్దం..

> లచ్చిమికి, పిల్లాడికి కనిపించకుండా ఎక్కడికేనా దూరంగా పోవాలి. అప్పుడు తన సంపాదన తనకే.. తినచ్చు, తాగచ్చు, ఏం చేశావనీ, ఏదనీ అడిగేవాడుండడు. తన ఇష్టానికి తానే రాజు.

'ఇంత పొద్దున్నే ఏం ముంచు కుపోతుందనో బయల్దేరాడు! శుక్రవారం..నాలుగు పైసలు ఎక్కువ వస్తాయనే కద! ఎంతసేపూ సంపాదనేకాని, ఒంటి సంగతి చూసుకోకపోతే నమ్ముకుని బ్రతుకుతున్న నా గతీ, పిల్లాడి గతీ ఏం కావాలి? దొరక్కపోతే వస్తుంటాం. దొరికిన్నాడు కలిసి తింటాం. ఇట్టా చేయటం న్యాయమేనా?'

ఎంత పెద్ద దెబ్బ తాకిందో, తెలివీ ధ్యాసా లేకుండా పడిపోయాడు. కోవెల్లోని స్వామికి నే చేసుకున్న పూజ. నా మనిషి నాకు దక్కాడు.

'మీరన్నా కొంచెం చెప్పండి, అన్నలూ!"

మాట వణికిపోతూంటే వెక్కుతూ అంటున్న లచ్చిమి గొంతు వినిపించింది.

కళ్లు మూసుకుని బాధననుభవిస్తున్న వీరప్ప, ఇవన్నీ వింటూనే ఉన్నాడు. అతనిలో సంచలనం బయలుదేరింది.

'నాకు దెబ్బ తగిలితే, దానికే తగిలినంత విలవిల్లాడిపోతూందే... నా గురించి మరో మనిషి అలా మనసు కోసుకోవటం! అబ్బా! ఎంత అదృష్టం! నేనంటే లచ్చిమికి ఇంత ప్రేమా?"

నేనెంత కసాయివాణ్ణో! కాకపోతే.. ఎప్పుడు నేను లచ్చిమిని గురించి అనుకునేది– 'అది నా బ్రతుక్కి పడి ఉందని. ఇంత ప్రేమ వదిలేసి పోదామనుకున్నానా?"

'ఇంకా నయం.. అదృష్టం.. బావుంది.. ఎంతో దూరం వెళ్లి పశ్చాత్తాపపడి తిరిగి రాకుండా, మొదటి నాలుగడుగుల్లోనే తెలుసుకున్నాను' అనుకున్నాడు.

లచ్చిమి ఒరుసుకుపోయినచోట నూనె రాయటం మొదలుపెట్టింది.

'అబ్బా!' అన్నాడు కళ్లు తెరుస్తూ..

రోజూ కనబడే రాళ్ల కప్పు, లచ్చిమి, రాజాలు, మరో ముగ్గురు– అతని ముఖంలోకే ఆత్రంగా చూస్తూ కనిపించారు.

స్పృహలోకి వచ్చిన వీరప్పని చూసి, లచ్చిమి కళ్లనీళ్లు ఆపుకోలేకపోయింది.

తెరలు తెరలుగా దిగిపోతూన్న కన్నీరు, వణికే పెదాలు, ఎగసిపడే ఎద– లచ్చిమి ఎంతటి సంక్షోభాన్ని అదుము కుంటూందో తెలిసింది అతనికి.

"పెద్ద దబ్బెం తగల్లేదు కద, వీరప్పా! ఏ జెష్ట గడియాన లేచావో.. ఇంత పెందరాళే ఏం ముంచుకుపోతూందని లేచావ్?" అంది.

నీళ్లు తిరిగే ఆ కళ్లనూ, వాటి వెనక వెలిగే అనురాగాన్నీ భరించలేకపోయాడు.

వీరప్ప గుండె నీరయింది. "ఇంకెప్పుడూ వెల్లనులేవే.." అని గొణుక్కుంటూ, లచ్చిమి చేతిని తన చేతుల్లోకి తీసుకుని, గుండెల మీద అదుముకుంటూ కళ్లు మూసుకున్నాడు.

అంత బాధలోనూ ఏదో హాయి అనుభవించగలిగాడు కుర్రాడు. తను లచ్చిమి అంతా ముద్దగా కలుసుకుపోయినట్లు,

ఆ ముద్దలోంచే తను వెళ్లవలసిన బాటకు మెట్లు పరుచుకున్నట్లు అనిపించింది వీరప్పకి. ●

# అన్నం నుండి ఆనందం వరకు...

దశోపనిశత్తులను గేయాల్లో ముఖ్యంగా ముత్యాల సరాలలో అందించిన వారిలో ఆచార్య మసన చెన్నప్ప గారిని, తర్వాత శ్రీ జక్కని వేంకట రాజం గారిని చెప్పుకోవాలి. తాత్త్విక భూమిక వ్యక్తిత్వ వికాసానికి పునాది వంటిది.


**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందన:**
**పార్థోవత్స: సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥**

**గోవులన్నీ ఉపనిషత్తులు,**
**కృష్ణుడేమో పాలుపితికెను**
**దూడ పార్థుడు, బుధులు భోక్తలు**
**మధుర గీతామృతమై క్షీరము**

ఈ ముత్యాలసరం వంటి శైలిలో శ్రీ వేంకట రాజం గారు ఒక్కొక్క ఉపనిషత్తును అందిస్తున్నారు. ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, బృహదారుణ్యకాలు దశోపనిషత్తులు. ఆ వరుసలో ఇప్పుడు తైత్తిరీయం వచ్చింది.

ఈ ఉపనిషత్తులో శిక్షావల్లి, బ్రహ్మానందవల్లి, భృగువల్లి అనే మూడు భాగాలు ఉన్నాయి.

వేదమంత్రాల ఉచ్చారణకు సంబంధించిన అనేక అంశాలు శిక్షావల్లి లో ఉన్నాయి. ఆ మంత్రాల వర్ణాలను సమాన భావంతో ఉచ్చరించాలి. దానికి సంధి జ్ఞానం అవసరం. సంధికి మరోపేరే సంహిత. అందుకే సంధి-సంహితల జ్ఞానం పొందే సాధనంగా భావిస్తారు. సంధులు లేదా సంహితలు మొత్తం అయిదు. వీటినే లోకం, పృథివి, విద్య, ప్రజ్ఞ, ఆత్మ అని పిలుస్తారు. ఈ అయిదింటిని కలిపి మహా సంహిత అంటారు.






ప్రతులకు:
'గురుకృప'
నెం.7-2-109,
సుభాష్‌నగర్
సిరిసిల్ల-505 301
రాజన్న సిరిసిల్లా జిల్లా
సెల్:9440021734

శిక్షాపల్లిలో మొత్తం పంద్రెండు అనువాకాలున్నాయి. పృథ్వి, విద్య, సంతానం, శరీరం ఇలా వీటిలో పూర్వ వర్ణం, ఉత్తర వర్ణం, సంధి, కలిపే అంశం తెలుపబడతాయి.

**అథాధివిద్యమ్: ఆచార్య: పూర్వరూపమ్**
**అంతే వాస్యుత్తర రూపమ్**
**విద్యా సంధి:, ప్రవచనం సంధానమ్**
**ఇత్యాధి విద్యమ్**

విద్యలో ఆచార్యుడు పూర్వ వర్ణం: శిష్యుడు తురువాత వర్ణం; విద్య సంధి, ప్రవచనం కలిపేది. ఈ అంశాన్ని ఇలా తెలిపారు ముత్యాల సరాల అనువాదంలో రచయిత శ్రీ వేంకటరాజం గారు.

**మొదటి రూపము గురువు కాగా**
**శిష్యుదుత్తర రూపమవగా**
**సంధిరూపము విద్యయేయగు**
**ప్రవచనము సంధానపరచును.**

ఈ శిక్షావల్లిలో చివరిది స్నాతకోత్సవ సందర్భంగా గురుబోధ, దీనిని కేవలం భారతదేశమే కాదు, ప్రపంచ మంతా స్వీకరించింది. ఇక్కడ మూలం తప్పకుండా తెలుసుకోవాల్సి ఉంది.

**వేదమనూచ్య**
**ఆచార్యో అంతేవాసిన మనుశాస్తి**
**సత్యంవద: ధర్మం చర**
**స్వాధ్యాయాన్ మాప్రమద:**
**ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య**
**ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీ:**
**సత్యాన్న ప్రమది తవ్యమ్**
**ధర్మాన్న ప్రమది తవ్యమ్**
**కుశలాన్న ప్రమది తవ్యమ్**
**భూత్యైన్య ప్రమదితవ్యమ్**
**స్వాధ్యాయ ప్రవచనాభ్యాం నప్రమది తవ్యమ్**
**దేవపితృ కార్యాభ్యాం నప్రమది తవ్యమ్**

**మాతృదేవోభవ**
**పితృదేవోభవ**
**ఆచార్యదేవోభవ**
**అతిథి దేవోభవ**
**యా నవవద్యాని కర్మాణి**
**తానిసేవితవ్యాని, నో ఇతరణి..**

ఇదంతా పదకొండవ అనువాకం లో ఉంటుంది. గురువు వేదం ఇలా చెబుతుందని చదువు పూర్తయిన శిష్యునికి (స్నాతకునికి) చెబుతాడు. పై విషయాలన్ని పదకొండు ముత్యాల సరాలలో చెప్పారు. ఒక్క ముత్యాల సరం చూద్దాం.

**తల్లిదరండ్రుల గురువరేణ్యుల**
**దేవతలుగా నెంచవలయును**
**దర్మకర్మము లెల్ల వేళల**
**మరువకుండను చేయవలయును.**

ఇక బ్రహ్మానందవల్లిలో (రెండవ అధ్యాయంలో) తొమ్మిది అనువాకాలు న్నాయి. ఇందులో బ్రహ్మ వర్ణన ఉన్నది.

బ్రహ్మ సత్యం, ఇది జ్ఞాన స్వరూపం, ఆనందమయం. బ్రహ్మ జ్ఞానం కష్ట సాధ్యం. ఈ జ్ఞానాన్ని పొందిన తర్వాత మనిషి బ్రహ్మ రూపుడై మరింత ఆనందాన్ని అనుభవిస్తాడు. అన్ని ఆనందాలకు బ్రహ్మయే ఏకమాత్ర స్థానం. దాన్ని తెలుసుకొన్న తర్వాత మనిషి నిర్భయుడవుతాడు. అతణ్ణి ఎన్నడూ ఎలాంటి దుఃఖం, ఎలాంటి లోటూ బాధించదు. అతను ఎన్నడూ ఎలాంటి పాప వాసనను మనస్సులో ఎంత మాత్రమూ ఉంచుకోడు.

**బ్రహ్మమును చేరంగ లేకను**
**మనసు, వాక్కును మరలు చుండును**
**బ్రహ్మమే ఆనంద రూపము**
**ఎఱుగ నేర్చిన భయము కలుగదు**

**వేదముల అర్థమ్ము నెరిగిన**
**కామములు లేనట్టి వాడగు**
**బ్రహ్మవేత్త మనుష్య గంధ**
**ర్వుడుగ తానానందమొందును.**

ఈ విధంగా పైన చెప్పుకొన్న సారాంశాన్ని ప్రతి మంత్రాన్ని మొత్తం తొమ్మిది అనువాకాలలో 45 ముత్యాల సరాలుగా అందించారు శ్రీ వేంకటరాజం గారు.

ఇక చివరి భృగువల్లిలో 46 ముత్యాల సరాలున్నాయి.


తండ్రి వరుణుడు, కుమారుడు భృగువు మధ్యలో జరిగిన సంవాద పూర్వక సంభాషణతో అన్నమే బ్రహ్మ మనీ, ప్రాణమే బ్రహ్మమనీ, మనసే బ్రహ్మమనీ, విజ్ఞానమే బ్రహ్మమనీ చివరకు ఆనదమే బ్రహ్మమనీ (ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్) నిర్ణయిస్తారు.

గురువు తండ్రియైన వరుణుని మార్గదర్శకత్వంలో చేసిన అన్వేషణలో శిష్యుడూ కొడుకూ అయిన భృగువు తేల్చిన బ్రహ్మ (ఆత్మ-ఆనంద) సాక్షాత్కారమిదే.

ఇదే అన్నం నుండి ఆనందం వరకు దర్శించిన సర్వోత్తమ సర్వశ్రేష్ఠ భారతీయ వేదాంత దర్శనం.

అన్నం దగ్గర, ప్రానం దగ్గర, మనస్సు దగ్గర, విజ్ఞానం దగ్గర కొట్టుకు చస్తున్న ప్రపంచానికిది కనువిప్పు.

అందరికీ ఆనందం కావాలి అన్నదే భారతీయ ఋషిదర్శనం. ముత్యాల సరాల్లో ఈ ఆనందాన్ని అందించిన శ్రీ జక్కని వేంకటరాజం గారికి అభినందనలు.



-ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
సెల్: 9866956250

(జక్కని వెంకటరాజం రాసిన 'తైత్తిరీయోపనిషత్తు' గ్రంథానికి డా॥కసిరెడ్డి వెంకటరెడ్డిగారు రాసిన ముందు మాట..)

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1603వ రోజు 'ట్రంపుకు చెయ్యిచ్చిన నోబెల్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ట్రంపుకు చెయ్యిచ్చిన నోబెల్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## 'ట్రంపరితనానికి' చెక్

షేక్ హ్యాండిచ్చి
ఊపేస్తుందనుకుంటే
హ్యాండిచ్చి షేక్ చేసింది
పేరుకు తగ్గట్టే నో..బెల్
ఏ బెల్లూ బైటికి లేకుండానే
'ఆయన' గుండెగదుల్లో ఝల్లుమనే
ఢమరుక ధ్వని సృష్టించింది.
'కోరినా' కోరకున్నా
ట్రంపుడు సాగిలపడ్డా
శాంతి కపోతం
చేరవలసిన గమ్యమే చేరింది
అమెరికా జాతీయ పక్షి గద్ద చూపులకు
బలికాలేదు
సంయుక్త రాజ్యాధిపతికి
ఎర్రతివాచీ పరుస్తుందనుకున్న నోబెల్
ఎర్రరంగు సిగ్నల్ ఇచ్చి
కరీబియన్ తీరం దారి పట్టింది.
పీసులు పీసులుగా
పీసు మాట చెప్పినా
ప్రపంచాన్ని ఇన్ సోమ్నియాలో
ముంచిన
గొడవలు తెంపని
జగడపు తెంపరి
పొందాడు
సరైన రిక్తహస్త బహుమతి!.
'ట్రంపరితనానికి' చెక్
తుంటరితనానికి
అశాంతికాముకతకు
నియంతృత్వ వైఖరికి
ఒంటెద్దుపోకడకు
తగిన శాస్తి.

-డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు

## నోబెల్ తప్పిపోయిందట

అయ్యయ్యో..
నోబెల్ మిస్సయిందట
అరే
అంత దూరం వెళ్ళి
గిర్రున వెనుదిరిగిందట.
అధ్యక్షుడి ప్రసంగం
సునామీలా గర్జన
జ్యూరీ చెవులకు
మాటల మర్మం తెలిసిందా..
శాంతిలేని మాటలతో గాలిగోడలెన్నో..
యుద్ధం తగ్గిందా అంటే..
ట్వీట్లు మైకులో మాట్లాడినట్లే..
నోబెల్ కూడా సైలెంట్ మోడ్ లో
ముక్కుసూటిగా ఫోటోషూట్లు
వెనుక టెర్రస్‌లో బాంబుల మోతలు
నోబెల్ కమిటీ కంగారు కాబోలు
వస్తే ఇస్తే శాంతి ఎక్కడ
పతకం రాకపోయినా
పెద్దగాయం కాదులే
ప్రపంచానికి
ప్రచారం కావడమే లాభం.
నోబెల్ గాలిలో తప్పిపోయింది
వైట్ హౌస్
దారిలో వెతుకుతూవచ్చింది
లోపల అధ్యక్షుడు ట్వీట్లలో బిజీ
శాంతి మాటల ట్రెండ్‌తో
యుద్ధం మొదలైనా
"పీస్ పీస్" అంటూనే..
వెనక్కి తిరిగి
ఆయుధాల బడ్జెట్ పెంచాలని..
ఇలా అయితే..
ఇక బాంబుకీ పతకం ఇవ్వాల్సిందే..
స్మైలీతో ప్రసంగాలు
సిగ్నేచర్‌లో సంతకాలు
పిక్చర్ పర్ఫెక్ట్ కానీ
పబ్లిక్ కన్ఫ్యూజన్..
మాటలలో శాంతి
పనులలో యాక్షన్
నోబెల్ కూడా భయపడి
"థాంక్యూ నెక్స్ట్ పర్సన్!"
పతకం రాకపోయినా ప్రెస్ రిలీజ్
"నా శాంతి భావనలకు
ప్రపంచం ఇంకా సిద్ధం కాలేదని"
ప్రస్తుతం ఎవరివో మాటలు
గాలిలో బాగా తిరుగుతున్నాయి
"నోబెల్ కాదు నోబడి బిలీవ్స్ ప్రైజ్"
అయితే మాట అన్నవాడే
విన్నారా ఏంటి..

-శ్రీలతరమేశ్ గోస్కుల

## శాంతి వరిస్తుందా?

ఎవరికేది ఎక్కడ దక్కాలో
వారికే దక్కుతుంది
అశాంతిని మూటగట్టుకుని
క్రూరత్వాన్ని ప్రేరేపిస్తూ
నిత్యం నిప్పుతో చెలగాటం
శాంతి బహుమతి వరించేదెట్లా?.
మాటల తూటాలు
కయ్యానికి కాలు
నీతి లేని చోట
అశాంతి పలికే నోట
శాంతికి చోటెక్కడ?.
అశాంతిని ప్రోత్సహిస్తూ
పరులపై పెత్తనం
తగ్గిన హుందాతనం
మోహంలో విద్వేషం
పగబట్టిన పాముచందం
వరిస్తుందా శాంతి
వారిస్తుంది
అడ్డం పడుతుంది!!.
కలలు కల్లలై
అహంకారానికి పడిన తెర
వెనిజులాను చేరిన శాంతి
మరియా కోరినాను
చేరిన బహుమతి
మచాడో చెంతకు
దౌడు తీసిన నోబుల్
ట్రాంప్ కు
అంతా నిల్ నిల్!!.
శాంతమే లేదు
శాంతి బహుమతి ఎలా వస్తుంది?.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## తలరాత

సొంత డబ్బా కొట్టే ట్రంపూ...
చేసిన కర్మ చెడని పదార్థం
తప్పదు ఫలితం
ఒప్పదు పరిస్థితి
దురాశ దుఃఖానికి చేటు
చెప్పేది ఒకటి
చేసేది ఒకటి
ఉద్రిక్తతలు ఆపి
యుద్ధాలు ఆపాననే గొప్పలు
ట్రంపు సొంత డబ్బా
ఫలించలేదు
మరియా కొరినా మచాడో
అర్హురాలైంది.
పసిపిల్లాడిలా
ఏడవలేక నవ్వుతూ
రకరకాల డబ్బాలు మోగించి
గొప్పగా చాటుకున్నాడు
అతి చిన్న బుద్ధితో
యుద్ధాలకు బదులు
బతుకుతున్న మనుషులను
పరుగెత్తిస్తూ ఉంటే
ప్రపంచ శాంతి
పరగడుపు భోజనం అయింది
అన్ని వ్యతిరేక గీతాలే
ఆదరింపు లేదు
అద్భుత ఓటమి జీవితం
వెకిలి వేషాలే
అర్థం లేని హాస్యాస్పద జీవితం.

-కె.కె.తాయారు

## ధమాల్

ట్రంప్ ట్రంపెట్
ధమాల్
సెల్ఫ్ డబ్బాకి
పడింది చిల్లి
ఇదేమన్నా
డాక్టరేట్లు ఓట్లు
డబ్బుకుమ్మరించి
కొనుక్కునే వ్యవహారమా?.
"నేనే మొనగాడ్ని
ఆపాను యుద్ధాల్ని
నాకు కావాలి పీస్ ప్రైజ్" అంటూ
కీచుకీచు అరుపులు
కొట్టాడు డప్పు
జారాడు గొప్పులో
కోతిలా గెంతి
అందరినీ బైటకి గెంటి
ఆశలు ఆడియాసలు కాగా.
కుళ్ళు గుమ్మడి బుర్ర
పనిచేయక మనసంతా తొర్ర
పిచ్చి ముదిరి
తలకు రోకలి చుట్టే వ్యవహారం.
అహంకారం
దురాశ
సిగ్గు ఎగ్గులేని ప్రేలాపనలు
పిచ్చివాడిచేతిలో రాయిలా పాపం!
అమెరికా వేసింది బిక్కమొహం.
ఆశలు అడియాసలు కాగా
దేశాన్ని దిగజార్చిన
దుర్యోధన దుశ్శాసన అంశ!
మరియా కోరినా నిండుకుండ
బడబడ దిగజారుడు
ట్రంప్ తెంపరితనం
చిల్లికుండ.
ధిక్కారము సైతునా!? అని
తెల్లారేప్పటికి ఏఉపద్రవం తెస్తాడో
దెబ్బకు దిమ్మతిరిగి ఏంచేస్తాడో
ప్రపంచమంతా ఒళ్లంతా కళ్లు
రకరకాల వ్యాఖ్యానాలతో నోళ్లు
ఓటు కోసం నోటు
పని చేయని చోటు!
నోబెల్ శాంతిబహుమతి
అందరికీ షాక్ ఇచ్చి
శభాష్ అనిపించుకుంది.

-ఎ.రాజ్యశ్రీ

## శాంతి కపోతం

వచ్చివాలుతుందనుకున్న
శాంతికపోతం
తీరందాటి ఎగిరిందీ వేళ
ముకుళిత హస్తాల ట్రంపుకు
నేడు నిరాశ
శాంతికపోతానికి తెలుసునేమో
ఎక్కడ ఎప్పుడు ఎలా వాలాలని
బలాలు ఎంతున్నా
భాగ్యం సిద్ధిస్తుందా?.

-లక్ష్మారెడ్డి పసుల

## నెంబర్వన్ నేడయ్యాడో విదూషకుడు

అగ్రరాజ్యాధినేత ఓ టెంపరి
మాటల్లో గడుసరి తుంటరి
సర్వం నేననే గర్వపు తెగవరి
ట్రంప్ నేడయ్యాడు ఒంటరి
నోబెల్ గుణపాఠం నేర్పింది.
తనకు తానే పెద్దన్నగా తలచి
యుద్ధాలనాపుతానని భావించి
పాక్ ను సిఫార్స్ చేసేలా ఒప్పించి
భారతదేశాన్ని వంచాలని చూచి
భంగపడి బెంగపడుతున్నాడు.
దేశాలను సుంకాలతో బెదిరిస్తూ
యుద్ధ సామాగ్రి అమ్మి ఆర్జిస్తూ
నోరు పెద్ద జేసి, గీపెట్టి అరుస్తూ
ఐరాస ద్వారా అందర్నీ బెదిరిస్తూ
బుస్సని బెదిరించి తుస్సనిపించాడు.
స్వలాభం తప్ప పరహితం కోరడు
నోటిదూలెక్కువ మాటమారుస్తడు
బేవార్స్ పనులుజేసి బోల్తా పడ్డడునో
నో అన్నా నోబెల్ కావాలంటడు
ఇప్పుడు గౌరవంపాయె, గాలీపాయె.
ట్రంపనుకుంటారు నేనే విశ్వ హీరో
రణంలో జనంచస్తే, అయ్యాడు నీరో
నోబెలందక అన్పించుకొనె జీరో
దేశంలో అంటున్నారు"కరో యా మరో"
శాంతి శాంతంటూ రేపాడు అశాంతి.
భారత్ ను నష్టపరచాలనుకుని
నా తడాఖాను చవి చూపిస్తానని
పులిలా గాండ్రించి పిల్లై జారుకుని
నోబెల్ జారి పోగా బేర్ బేర్ బేరని
నెంబర్వన్ నేడయ్యాడో విదూషకుడు.

-కాటేగారు పాండురంగ విఠల్

## అంతా భ్రాంతియేనా!

ప్రపంచమంతా ఉత్కంఠతో
ఎదురు చూసిన క్షణం
మాటలతో కోటలు కడుతూ
ప్రపంచ యుద్ధాలను నేనే ఆపానని
నోబెల్ శాంతి బహుమతికి
నేనే అర్హుడనని
చంకలు కొట్టి
ఢంకా బజాయించి
లాబీయింగ్ ని బనాయించి
సొంత డబ్బాతో కొట్టుకు పోయింది
మాటలతో యుద్ధాలను
ఆపానన్న డాంబికం
బీరాలను పోతున్న వేళ
చర్చలతో ఏయుద్ధాలూ
సమసిపోలేదని
శాంతి కంటే రాజకీయానికి
ప్రాధాన్యత ఇచ్చారని
నోబెల్ కమిటీ నిర్ణయం ముందు
తలవొంచింది
అగ్రరాజ్య అధినేత అహంకారం
అత్యాశతో గొప్పలు పోయింది
సొంత ఇంట్లోనే కలకలం రేపింది
హై పిచ్ అధికార మదోన్మాదం.
వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు
ప్రజాస్వామ్య హక్కులకై పోరాడిన
మరియా కోరినా మచాడోను
నోబెల్ శాంతి గ్రహీతగా
ప్రకటించింది
ట్రంపు కలలు కల్లలై
ఆశలు అడియాశలై
నిరాశతో నిలువునా నీరయ్యాడు
హాస్యాస్పదంగా
తనని తానే ఎత్తేసుకున్న
డబ్బారాయుడని
లోకం నోట్లో నానుతూ..

-పి. పద్మావతి

## శాంతి లేని చోటికా నోబెల్!

ప్రపంచం చూసినదెందుకు
తాము కరెక్టా ట్రంప్ కరెక్టా
ఓటుకు నోటంత ఈజీనా
నోబెల్ కంటితో చూస్తే అర్హుడా.
యుద్ధోన్మాదికి మేక ముసుగు
శాంతిప్రియులకిక విసుగు
వెనిజులా స్లోఅండ్ స్టడీగా
విన్‌అయ్యి చూపింది ప్రపంచానికి.
ఉపద్రవాలు ఉల్లిపాయలేవు
మూసుకుని
మూలన కూచోవలసిందే!
అన్నపాత్రనిలుపు కోవాలన్నా
పెద్దన్న తగ్గాల్సిందే.
శాంతికర్థం తెలియని చేతికా
శాంతిబహుమతి!.

-ప్రశాంతి రేవూరి

## కుట్టు మిషన్ అందజేత

అమరావతి, అక్టోబర్ 15: నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ సంపంగి మాధురికీ కమ్మర్ పల్లి లయన్స్ క్లబ్ ఈ రోజు కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా కమ్మర్ పల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ మాట్లాడుతూ సంపంగి మాధురి భర్త బాలరాజ్ మరణించడంతో తన ఇద్దరు పిల్లలను పోషిస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నారన్నారు.

లయన్స్ క్లబ్ నిర్వహించే ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఇలాంటి నిరుపేద మహిళలకు చేయూత అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రేవతి గంగాధర్ కోశాధికారి తెడ్డు రమేష్, ఉపాధ్యక్షుడు సున్నం మోహన్, కార్యవర్గ సభ్యులు నోముల నరేందర్, చింత ప్రదీప్, పాలేపు నర్సయ్య, చంద్ర శేఖర్,పవన్ సుంకరి విజయ్ కుమార్, సంపంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జైత్యయాత్ర షురూ : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 15:పొలిటికల్ బ్యూరో : జూబ్లీహిల్స్‌బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేశారు. ఈ రోజు షేక్‌పేట్ తహసీల్దార్ ఆఫీస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలతో వెళ్లి తొలి సెట్ నామినేషన్ వేశారు.

దివంగత మాగంటి గోపీనాథ్ భార్య సునీతను బీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నామినేషన్ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు పద్మారావు, రావుల శ్రీధర్‌రెడ్డి, దీదీప్య రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.

**అభివృద్ధి, అరాచకం మధ్య పోటీ**

బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌నామినేషన్ కోసం బయల్దేరారు. నామినేషన్ వేయడానికి వెళ్లేముందు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీల మధ్య జరిగే ఎన్నిక కాదు.. పదేండ్ల అభివృద్ధి పాలనకు, రెండేండ్ల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని అన్నారు.

కాంగ్రెస్ చేతిలో మోసపోయిన కు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని అన్నారు. మరోసారి రాష్ట్రంలో గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల మద్దతుతో, అండతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ఘన విజయం సాధిస్తారన్నారు.

## పొలాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టాలి..

నంగునూర్, ఆంధ్రప్రభ : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని పాలమాకుల పీఏసీయస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి అన్నారు. నంగునూర్ మండల పరిధిలోని జేపీ తండా గ్రామంలో ఈ రోజు పీఏసీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ వ్యవసాయ పొలాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతనే సెంటర్లకు తీసుకురావాలనీ, వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఇంటికి నీళ్లు కొడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కు గురై మృతి

కరీంనగర్, అక్టోబర్ 15: : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కునారం రోడ్ నూతన ఇంటి నిర్మాణం చేస్తున్న వ్యక్తి తన ఇంటికి నీళ్లు కొడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కు గురై మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది.

పట్టణానికి చెందిన వెలిచాల రమేష్ నూతన ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ఇంటికి క్యూరింగ్ కోసం నీళ్ళు కొడుతుండగా కరెంట్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పెద్దపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.



## దీపావళి పర్వదిన విశిష్టత

భారతదేశం వసుదైక కుటుంబం పురాణ కాలం నుండి ఆచార సంప్రా దాయ లకు పుట్టి నిల్లు. అటువంటి ఆచారాలలో మనం పాటించే వాటిలో పండుగలు ముఖ్యమై నవి. అలాంటి పండుగలలోదీపావళి ఒకటి .జగతిని జాగృత పరచే చైతన్యదీప్తుల శోభావళి దీపావళి.

ఈ దీపావళి పండుగ ఆశ్వీయుజ మాసం చతుర్దశి నాడు నరక చతుర్దశిగా మరుసటి దినం అమవాస్యనాడు దీపావళిగా జరుపుకుంటారు. ద్వాపరయుగం నుండి ఈ పండుగ జరుగుతుంది. పండుగ పూర్వకథని గమనిస్తే కృతయుగంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు వర గర్వంతో సాధుజనులను పీడించేవాడు. తన అహంకారంతో భూదేవిని ఎత్తుకెళ్ళి పాతంళంలో దాచాడు. ఆగ్రహించిన విష్ణుమూర్తి దశవాతారాలలోని మూడవ అవతారం అయిన వరాహస్వామి అవతారంలో వెళ్ళి పాతాళంలో హిరణ్యాక్షుడుతో యుద్ధం చేసి భూదేవిని రక్షించాడు, అప్పుడు వరాహస్వామి భూమాత మోహానికి గుర్తుగా వారికి జన్మించినవాడు నరకాసురుడు. వరాహ స్వామి భూమాత నిషిద్ధసమయంలో కలవడం వలన అనురసంధ్యా సమయంలో జన్మించడంతో నరకాసురుడికి పుట్టుకతో రాక్షస లక్షణాలతో జన్మించాడు. ఇదికామాలు తెలిసిన భూమాత అతన్ని విష్ణుమూర్తి సంహరిస్తాడని తన బిడ్డ చావు తన చేతిలోనే ఉండాలని వరం విష్ణుమూర్తి వద్ద వరం తీసుకుంటుంది. తర్వాత నరకాసు రుడిని జనకుడు అనే రాజుకి అప్పజెప్పి విద్యాబుద్ధులు నేర్పిం చమంటుంది భూమాత, జనకుడు నరకాసురుడికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి రాజును చేస్తాడు. నరకుడు కామాఖ్యను రాజధానిగా చేసుకొని ప్రాగ్జ్యోతిష్యపురము (ప్రస్తుతం అది అస్సాంలోని గౌహతి ప్రాంతం.) అనే రాజ్యాన్ని పరిపాలిస్తుం టాడు. కామాఖ్యలోని అమ్మవారిని తల్లిలాగ భావిస్తు చక్కగా పూజచేసేవాడు. తన రాజ్యము లోని ప్రజలందరిని ఎంతో చక్కగ పరిపాలించే వాడు. ఈ విధముగా కొన్ని యుగాలు గడిసిపోయాయి. తర్వాత ద్వాపరయుగములో, అతనికి పక్క రాజ్యమైన శోణితపుర ముకు రాజైన 'బాణాసురునితో "స్నేహము ఏర్పడుతుంది. బాణా సురుడు స్త్రీలోలుడు. వారిపై బలాత్కారం చేసేవా డు. అతని దృష్టిలో స్త్రీ ఒక భోగవస్తువు. అతనితో నరకాసురుడు స్నేహం చేశాడు. అతని ప్రభావము చేత నరకాసురుడు మెల్లగా అమ్మవారి పూజ ఆపివేశాడు. ఇంకా అతనిలో పుట్టుకతో వచ్చిన రాక్షస లక్షణాలు బయటకి వచ్చాయి. నరకాసు రుడు కామ పిశాచి అయ్యి ప్రపంచ ములోని ఇతర రాజ్యాల మీద దండయాత్ర చేసి ఆయా రాజ్యాలలోని రాజ కుమార్తెలందరిని బలవంత ముగా ఎత్తుకొచ్చి తన రాజ్యములో బంధించి వివాహమాడదలిచాడు. ఆ విధముగా 16,0000 మంది రాకుమార్తెలను బంధించాడు. వరాహ స్వామి దేవేరి-భూదేవికి కలిగిన సంతానమే 'నరకాసురుడు'. దేవపుత్రుడే అయినా.. పుట్టిన వేళా విశేష ఫలితంగా నరకాసురుడిలో రాక్ష సత్వం నిండ పోతుంది. తరువాతి కాలంలో నరకా సురుడు 'కామ రూపాధిపతి'గా మారతాడు. తనను తాను అత్యంత బలవంతుడిగా భావించు కుంటాడు. వరగర్వంతో సకల లోవాసులను... దేవతలనూ విడిచి పెట్టకుండా అందరినీ హింసించడం ప్రారంభిస్తాడు. దీంతో నరకాసురుడి ఆగడాలనుంచి రక్షించమని బాధితులు దైవాన్ని స్మరిస్తారు. చివరిన నరకాసురుడు స్వర్గంపై దండయాత్ర చేస్తాడు. స్వర్గాధిపతి ఇంద్రుడిని తరిమివేసి స్వర్గాన్ని ఆక్రమిస్తాడు. ఈ విధంగా నరాకాసురుడు కృతయుగం నుండి ద్వాపర యుగం వరకు అందరినీ హింసించసాగాడు.

ద్వాపర యుగంలో విష్ణుమూర్తి శ్రీకృష్ణుడుగా భూదేవి సత్యభామగా జన్మించారు. నరకాసురుడు యొక్క దుశ్చర్యలు మితిమీరి పోవడంతో శ్రీకృష్ణుడు సత్యభామ సమేతుడై నరకుడిపైకి యుద్ధానికి వెళ్ళాడు. వారి మధ్య యుద్ధం భయంకరంగా సాగింది.నరకాసురుడి బాణం తగిలి శ్రీకృష్ణుడు మూర్ఛ పోతాడు. అప్పుడు సత్యభామ నరకాసురుడితో ఘోర యుద్ధం సాగిస్తుంది. ఇలా ఈ భీకర యుద్ధంలో సత్యభామ చేతిలో నరకాసురుడు మరణిం చాడు. అప్పుడు సత్యభామకి కృతయు

గంలో వరాహస్వామి తనకి జన్మించినవాడు నరకాసు రుడు. అని తన బిడ్డను తానే చంపానని దుఃఖించి నా కుమారు డిని ఈ లోకం గుర్తుంచుకునేటట్లు చేయమని. శ్రీకృష్ణుడిని కోరం డంతో నరకాసు రుడు ఆశ్వయుజ బహుళచతుర్దశి నాడు అంతమవ్వడంతో ప్రతియేడు ఆశ్వయుజ మాసం లో వచ్చే చతుర్దశిని నరకచతుర్దశిగా జరుపుకుంటారని ఆయన సత్యభామకి వరమిచ్చాడు.

దీపాలను వెలిగించి సంబరాలను జరుపుకుంటారు. అప్పటి నుంచి 'దీపావళి' పండుగ జరుపుకోవడం మన ఆచారమైనట్లు మన పురాణాల కథనం. ఈ విధంగా చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి నాటి నుండి తమ కష్టాలు తొలిగి పోయాయని సంతోషించి ప్రజలు అనువాస్య ముందురోజు నరకచతుర్దశిగా మరునాడు అమవాస్య రోజు దీపావళిగా జరుపుకుంటారు.

**పండుగ నీతి:** పిల్లలు పెడద్రోవ పట్టినప్పుడు తల్లిదండ్రులు వారిని శిక్షించి మంచి తెలపవచ్చని, అలాగే చెడ్డవారితో స్నేహం చేయరాదని, దుష్టుల కు అంతం తప్పదని తెలుపుతుంది.



-డి.అమీర్
9642480702



సభలో ప్రసంగిస్తున్న అయాచితం శ్రీధర్.

హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి):కవిగా చిత్ర కారుడుగా నవలా రచయితగా ఎట్టి సృజనాత్మక రంగం లోనైనా అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ ఛైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా అడవి బాపిరాజు యాది లో సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ అడవి బాపిరాజు నవల నారాయణ రావు నేటికి తెలుగు సాహితీ లోకం లో అత్యుత్తమ కథలు లో ఒకటిగా చెప్పబడుతుంది అని చెప్పారు ప్రజల నోళ్ళలో బాపిరాజు రాసిన బావా బావా పన్నీరు బావను పట్టుకు తన్నారు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పాడుకుంటారు ఆ పాటతో బాపి బావ గా పేరు పొందారు అని గుర్తు చేశారు బాపిరాజు రాసిన చారిత్రక నవలలు గోన గన్నారెడ్డి,హిమబిందు పాఠ్య గ్రంథాలుగా ఎంపిక చేశారు అని వివరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కథక్ అంజిబాబు గాయకుడు వెంకట రావు గాన సభ పాలక మండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు

## ఆధునిక వైద్య ప్రక్రియలో అనస్థీషియా అత్యంత కీలకం !

అనెస్థీషియా లేదా మత్తు మందు ఇవ్వడం అనే విభాగం ఆధునిక వైద్య చికిత్సలో అతి ప్రధానమైన అంశం అయ్యింది. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లలో సహితం రోగికి నొప్పి లేకుండా సురక్షితంగా సర్జరీ పూర్తి చేయడం జరుగుతోంది. వైద్య చికిత్సా విధానంలో ఒక అంగానికి లేదా దేహంలో ఒక భాగానికి లేదా పూర్తి శరీరానికి తాత్కాలికంగా (నాడుల నుండి మెదడుకు సమాచారం ఆగి పోవడం) స్పర్శ కోల్పోయే విధంగా వైద్య నిపుణులు చేపట్టే ప్రక్రియను అనస్థీషియా లేదా మత్తు మందు (స్పర్శ లేకుండా చేసే) అని అంటారు. ఒనస్థీషియా మత్తు మందు ప్రయోగంతో రోగి స్పర్శను కోల్పోయి, సులభంగా సర్జరీ చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. శరీరంలోని ఒక చిన్న భాగానికి లోకల్ (స్థానిక) అనస్థీషియా, దేహంలోని అధిక భాగానికి రిజినల్ అనస్థీషియా, రోగి పూర్తి శారీరానికి జనరల్ అనస్థీషియా మందులను వాడడం జరుగుతుంది. దేహానికి ఉపశమనాన్ని లేదా మగతను కలిగించే ప్రక్రియను సెడేషన్ అని పిలుస్తారు.

### ప్రపంచ అనస్థీషియా దినోత్సవం:

16 అక్టోబరు 1846 రోజు "డాక్టర్ విలియమ్ టి జి మార్టన్" తొలిసారి మాచెస్యూట్స్ జనరల్ ఆసుపత్రిలో అనస్థీషియాను ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మక ప్రక్రియ మొదలైన రోజుకు గుర్తుగా ప్రతి ఏట 16 అక్టోబర్ నాడు "ప్రపంచ అనస్థీషియా దినోత్సవం (వరల్డ్ అనస్థీషియా డే)" పాటించడం జరుగుతున్నది. ఆధునిక అనస్థీషియాలో నూతన అనస్థీషియా ఔషధాలు, మానిటరింగ్ టెక్నిక్స్, సురక్షిత విధి విధానాలు, రికవరీ విధానాలు వాడడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ అనస్థీషియా దినం వేదికగా వృత్తి నిపుణులతో అవగాహన కార్యక్రమాలు, ప్రజలకు అవగాహన కల్పించడం, ఈ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను చర్చించడం పరిపాటిగా మారింది. అనస్థీషియా నిపుణులను అనస్థీషియాలొజిస్టులు అని పిలుస్తారు. సర్జరీ జరిగినపుడు ఆపరేషన్‌కు ముందు, ఆపరేషన్ సమయంలో, ఆపరేషన్ తర్వాత పలు ప్రధాన విధులను నిర్వహిస్తారు. వీరు సర్జరీ సమయంలో రోగికి నొప్పి రాకుండా చూడడమే కాకుండా క్రిటికల్ కేర్, రికవరీ వంటి చికిత్సలు నిర్వహిస్తారు.

రోగి భద్రత అనస్థీషియా తొలి ప్రాధాన్యత. వయోవృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, స్థూలకాయులు వంటి వర్గాలకు సర్జరీ జరిగినపుడు అనస్థీషియాలజిస్టులు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. రానున్న డిజిటల్ ఏఐ యుగంలో వ్యక్తిగత అనస్థీషియా, ఏఐ టెక్నాలజీ ప్రయోగం, నాన్-ఫార్మకాలోజికల్ టెక్నిక్స్, టెలీ మెడిసిన్ లాంటి నూతన అవకాశాలు బహుళ ప్రచారంలోనికి రానున్నాయి. వైద్య చికిత్సలో అతి ముఖ్యమైన సర్జరీ దశలో అనస్థీషియా పాత్ర వెలకట్ట లేనిది. రామున్న రోజుల్లో పెద్ద పెద్ద ఆపరేషన్లు సహితం అనస్థీషియాలజిస్టులు అతి ప్రధానమైన పాత్రను పోషించనున్నారు. మన సమీపంలో సేవలు అందిస్తున్న అనస్థీషియాల జిస్టులను సన్మానించి, పౌర సమాజం పక్షాన కృతజ్ఞతలు తెలియజేద్దాం.

(16 అక్టోబర్ "ప్రపంచ అనెస్థీసియా దినోత్సవం" సందర్భంగా)

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## 26న యానాంలో శిఖామణి సాహితీ పుర్కారాల ప్రదాన సభ

హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి):'కవిసంధ్య' సాహిత్య సాంస్కృతిక సంస్థ,ప్రతీ ఏటా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభ, కవి సంధ్య దశాబ్ది ఉత్సవం ఈ నెల 26 న ఉదయం 10 గంటలకు యానాం, బి. ఆర్. అంబేద్కర్ కళ్యాణ మండపం లో జరుగుతుంది.

జీవన సాఫల్య పురస్కారం ఆచార్య కొలకలూరి ఇనాక్, యువ పురస్కారం అవధానుల మణిబాబు అందుకుంటారు. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో మల్లాడి కృష్ణా రావు, మండలి బుద్ధ ప్రసాద్, అప్పాజోస్యుల సత్యనారాయణ, కోయి కోటేశ్వరరావు, కాళ్ళకూరి శైలజ, బొల్లోజు బాబా తదితరులు పాల్గొంటారు.

కవిసంధ్య ప్రతిభా పురస్కా రాలు డా. కోయి కోటేశ్వరరావు, ఎస్. ఆర్. పృథ్వి,పి. ఆర్. ఎల్. స్వామి, బి.మంగేష్, డా. వరుగు భాస్కర్ రెడ్డి,పచ్చిమాల శివనాగ రాజు, పుప్పాల సూర్య కుమారి, పొనుగు మట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్ స్వీకరిస్తారు. ఈ సందర్భంగా కవి సంధ్య - 56 ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరుగు తుంది.

-దాట్ల దేవదానం రాజు
కవి సంధ్య, యానాం
9440105978

## సినీ నటి అన్నపూర్ణకు అక్కినేని పురస్కారం



సినీనటి అన్నపూర్ణను సత్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి): అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అక్కినేని పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ శోభారాజు ముఖ్య అతిథిగా పాల్గొని సినీ నటి అన్నపూర్ణకు అభినందన-అక్కినేని పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. విజయ్ బాబు, డాక్టర్ కేవీ కృష్ణకుమారి, జీవీఎన్. రాజు, సంగమం సంజయ్ కిశోర్, అభినందన సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు జె. వసుంధరాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి, ఇ. భవానీ, శోభా పేరిందేవి లలితారావు, విశాలక్ష్మి పాల్గొన్నారు.

## సామాజిక సంస్కరణల ఉద్యమ శీలి రఘుపతి వెంకటరత్నం నాయుడు



హైదరాబాద్, అక్టోబర్ 15: (నేటినిజం ప్రతినిధి):సమాజంలో పలు ఆంధ విశ్వాసాలు మూఢ నమ్మకాలు ప్రబలివున్న కాలం లో ప్రజల్లో చైతన్యం కలిగించే విధం గా కృషి చేసిన తెలుగు వారు కందుకూరి వీరేశలింగం రఘుపతి వెంకటరత్నం నాయుడు లు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు రఘుపతి వెంకటరత్నం నాయుడు బ్రహ్మ సమాజం ద్వారా కుల మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక సంస్కరణల ఉద్యమ శీలి అని పేర్కొన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా లలిత కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా రఘుపతి వెంకటరత్నం నాయుడు యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ గొప్ప విద్యా వేత్త వెంకట రత్నం నాయుడు తాను ఉపన్యాసకుని పనిచేస్తున్న విద్యా లయం లో స్త్రీలకు ప్రవేశం కల్పించి సహ విద్య ను ప్రోత్సహించి బ్రిటిష్ ప్రభుత్వం చే నైట్ హుడ్ బిరుదు అందుకున్నారు అని చెప్పారు స్వతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలు శిక్ష అనుభవించారు అని వివరించారు.

ప్రజలు ఆయనను బ్రహ్మర్షి గా పిలిచే వారు అని ఇందుకు కారణం బౌద్ధ మతం లో దయ గుణం క్రైస్తవ మతం లో సేవా గుణం తో కలిసి ఆయన జీవించటం అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై రచయిత్రి శైలజ మిత్ర గాయకుడు రామోజీ గాన సభ పాలక మండలి సభ్యులు గీతా దేవి పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.